STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 349 | ఎడిటర్ : అలీ ముర్తుజా | గురువారం 19 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |



కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్

లష్కరే ఉగ్రవాది హతం!

- భద్రతా బలగాల కాల్పుల్లో లతీఫ్ భట్ మృతి
- మసీదులో దాక్కున్న ఉగ్రవాదిని గుర్తించిన బలగాలు

4



ప్రపంచ నేతలకు మోదీ కానుకలు

- ఫిలిప్పీన్స్ పర్యటనలో భారతీయ కళావైభవానికి పెద్దపీట
- ట్రంప్‌కు రాజస్థాన్ పిచ్వాయ్ చిత్రకళాఖండం

4

సాగర్ నీళ్లపై కుట్ర

- తెలంగాణకు తీరని అన్యాయం!
- నాగార్జునసాగర్ నుంచి 9 టీఎంసీల నీటి తరలింపునకు ఏపీ యత్నం
- ఏడాదిగా సారంగం తవ్వుతున్నా రేవంత్ ప్రభుత్వం మౌనం
- తాగునీటి పథకం ముసుగులో సాగునీటి తరలింపునకు కుట్ర

4



భూముల వేలం నిర్ణయాన్ని

విరమించుకోండి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

150 ఎకరాల్లో నివసిస్తున్న 15 వేల కుటుంబాల జోలికి రావద్దని హెచ్చరిక



4

టాస్క్‌ఫోర్స్ సోదాలపై హైకోర్టు కన్నెర్ర!

- సాధారణ దుస్తుల్లో తనిఖీలు చేయడాన్ని ప్రశ్నించిన పిటిషనర్
- డీజీపీ, హోంశాఖ, పోలీస్ కమిషనర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీలకు నోటీసులు


3



బర్డ్‌ఫ్లూ నియంత్రణకు

తొలి స్వదేశీ టీకా

నేడు దేశానికి అంకితం




4

తెలంగాణలో ఏసీబీ పంజా



- వేర్వేరు ప్రాంతాల్లో సర్పంచ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెస్ట్!
- రూ.2 లక్షల లంచం తీసుకుంటూ చిక్కిన సర్పంచ్
- రూ.1.50 లక్షల లంచం కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెస్ట్
- మధ్యవర్తితో కలిపి ముగ్గురి అరెస్ట్
- లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ సూచన

తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం రెండు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో ఓ సర్పంచ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన సర్పంచ్ రూ.2 లక్షలు స్వీకరిస్తుండగా, పెద్దపల్లి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రూ.1.50 లక్షల లంచం కేసులో ఏసీబీకి చిక్కారు. రెండు ఘటనల్లో మధ్యవర్తితో కలిపి ముగ్గురిని అధికారులు అరెస్ట్ చేశారు.



వివరాలు 2లో..



ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట!

విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాలు

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీలకే ప్రాధాన్యం
- సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ నిధుల్లో 50 శాతానికి పైగా వారికే ఖర్చు
- ఎస్సీ వర్గీకరణ అమలులో తెలంగాణ ముందంజ
- పార్లమెంటరీ కమిటీతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

"షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సంక్షేమం కోసం తెలంగా ణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పార్లమెంటరీ కమిటీతో భేటీ అయిన సీఎం, రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు."

హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సంక్షేమం, అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పార్లమెంటరీ కమిటీ ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా భేటీ అయింది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే నేతృత్వంలో జరిగిన ఈ సమా వేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన

మిగతా 2 లో



విద్యార్థుల కోసం 'తెలంగాణ దర్శిని'

2.92 లక్షల మంది విద్యార్థులకు రాష్ట్ర పర్యటనల అవకాశం

కార్యక్రమం కోసం రూ.26.30 కోట్ల నిధులు మంజూరు

చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల సందర్శన

ఒక్కో విద్యార్థిపై రోజుకు రూ.900 ఖర్చు

విద్యార్థులకు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదతో పాటు ప్రకృతి అందాలపై ప్రత్యక్ష అవగా హన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ దర్శిని' కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. సమగ్ర శిక్షా పథకంలో భాగంగా పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు ఈ విద్యా పర్యటనలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.26.30 కోట్ల నిధులు కేటాయించింది.

వివరాలు 2వ పేజీలో

నగరానికి నీటి తిప్పలు

- ఎల్ నినో ప్రభావంతో పడిపోయిన భూగర్భ జలాలు
- బోర్లు ఎండిపోవడంతో అపార్ట్‌మెంట్లలో నీటి నియంత్రణ
- ట్యాంకర్ల కోసం ఎదురుచూపులు.. పెరిగిన అదనపు ఖర్చులు
- వేసవి ముందే ముంచుకొస్తున్న నీటి సంక్షోభం

2



నగరంలోని వెస్ట్ సిటీలో నీటి కొరత తీవ్రరూపం దాల్చుతోంది. ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గిపోవడంతో బోర్లు ఎండిపోయాయి. ఐటీ సంస్థలు, భారీ గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల నివాస సముదాయాలతో విస్తరించిన ఈ ప్రాంతంలో పెరుగుతున్న జనాభాకు అవసరమైన నీటిని అందించడం కష్టంగా మారింది. గతంలో జలమండలి సరఫరా, బోర్ల నీటితో అవసరాలు తీరేవి. ప్రస్తుతం బోర్ల నుంచి నీరు అందకపోవడంతో జలమండలి సరఫరాపై ఆధారపడాల్సి వస్తోంది.



జంతుబలుల నిషేధానికి

సుప్రీంకోర్టు నో!

మతపరమైన వేడుకల్లో జంతువధను నిషేధించాలంటూ పిటిషన్

పిటిషనర్ వాదనలు విన్న అనంతరం వ్యాఖ్యం కొట్టివేత

4

రాష్ట్ర ప్రగతికి జాతీయ గుర్తింపు

- ప్రత్యేక కేంద్ర ప్రోత్సాహకం సాధనలో తొలి రాష్ట్రంగా తెలంగాణ
- రైతులకు సులభతరమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

2





విద్యార్థుల కోసం 'తెలంగాణ దర్శిని'

2.92 లక్షల మంది విద్యార్థులకు రాష్ట్ర పర్యటనల అవకాశం

కార్యక్రమం కోసం రూ.26.30 కోట్ల నిధులు మంజూరు

చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల సందర్శన

ఒక్కో విద్యార్థిపై రోజుకు రూ.900 ఖర్చు

హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): విద్యార్థులకు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదతో పాటు ప్రకృతి అందాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ దర్శిని' కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. సమగ్ర శిక్షా పథకంలో భాగంగా పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు ఈ విద్యా పర్యటనలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 26.30 కోట్ల నిధులు కేటాయించింది. రెండో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న సుమారు 2,92,286 మంది విద్యార్థులను ఈ యాత్రలకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్య, పర్యాటక, సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ, అటవీ శాఖలు సంయుక్తంగా కార్యక్రమాన్ని అమలు చేయనున్నాయి. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ. 900 ఖర్చు చేయనుండగా, ఇందులో విద్యాశాఖ నుంచి రూ. 500, పర్యాటక శాఖ నుంచి రూ. 400 సమకూరుతాయి. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో పర్యటనల ప్రణాళిక, ప్రాంతాల ఎంపిక చేపడతారు. ఈ యాత్రల్లో గోల్కొండ కోట, చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, వరంగల్ కోట, రామప్ప ఆలయం, వేయి స్తంభాల గుడి, భువనగిరి కోట, బుద్ధవనం, కొలనుపాక జైన మందిరం వంటి చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పించనున్నారు. శిల్పారామం, పోచంపల్లి, చేర్యాల, నిర్మల్ ప్రాంతాల్లోని కళలు, హస్తకళల గురించి కూడా విద్యార్థులకు వివరించనున్నారు. ప్రకృతి పర్యటనల్లో భాగంగా అనంతగిరి కొండలు, లక్నవరం, పాకాల సరస్సులు, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లు, మేడారం, నాగార్జునసాగర్ ప్రాంతాలను చేర్చారు. తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన అవగాహన ఏర్పడుతుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యావరణ పరిరక్షణపై భావితరాలకు ఆసక్తి పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 'తెలంగాణ దర్శిని' విద్యార్థులకు విజ్ఞానంతో పాటు కొత్త అనుభూతులను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణలో ఏసీబీ పంజా

వేర్వేరు ప్రాంతాల్లో సర్పంచ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెస్ట్!

రూ.2 లక్షల లంచం తీసుకుంటూ చిక్కిన సర్పంచ్

రూ.1.50 లక్షల లంచం కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెస్ట్

హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): రాష్ట్రంలో లంచావతారాలు ఎత్తుతున్న ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులపై ఏసీబీ ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగా మహబూబాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో ఏసీబీ అధికారులు మంగళవారం జరిపిన మెరుపుదాడుల్లో ఇద్దరు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. మహబూబాబాద్ జిల్లా మోదుగడ్డ తండా సర్పంచ్ ధరావత్ వీరు.. స్థానికంగా గ్రానైట్ క్వారీ నిర్వహణకు ఎలాంటి అడ్డంకులు సృష్టించకుండా ఉండేందుకు ఓ వ్యాపారిని భారీగా డిమాండ్ చేశారు. తొలుత రూ. 30 లక్షలు అడగ్గా, చివరకు రూ. 13 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో మొదటి విడతగా రూ. 2 లక్షలు నగదును ఖమ్మంలోని ఫిర్యాదుదారుడి కార్యాలయంలో తీసుకుంటుండగా వరంగల్ ఏసీబీ అధికారులు రంగప్రవేశం చేసి దాడి చేసారు. సర్పంచ్‌ను అదుపులోకి తీసుకుని, నగదును స్వాధీనం చేసుకున్నారు.

పెద్దపల్లి పబ్లిక్ ప్రాసిక్యూటర్, మధ్యవర్తి అరెస్ట్:

మరో ఘటనలో పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్ భారీ మొత్తంలో లంచం తీసుకుంటూ కరీంనగర్ ఏసీబీ అధికారులకు చిక్కారు. ధర్మారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక కేసులో నిందితులకు అనుకూలంగా సాక్షుల విచారణ జరిగేలా చూసి, వారు నిర్దోషులుగా విడుదలయ్యేందుకు సహకరిస్తానని నమ్మబలికారు. దీనికోసం తొలుత రూ. 2 లక్షలు డిమాండ్ చేయగా, చివరకు రూ. 1.50 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ లంచం మొత్తాన్ని మధ్యవర్తి రెడ్డిరాజుల రాజయ్య ద్వారా స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్, మధ్యవర్తి రాజయ్యను అరెస్ట్ చేసి ప్రత్యేక కోర్టులో హాజరుపరిచేందుకు తగిన చర్యలు చేపట్టారు.

ఏసీబీని సంప్రదించండి:

ప్రభుత్వ ఉద్యోగులు లేదా ప్రజాప్రతినిధులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీని ఆశ్రయించాలని అధికారులు సూచించారు. దీనికోసం టోల్‌ఫ్రీ నంబర్ '1064' లేదా వాట్సాప్ నంబర్ '9440446106'ను సంప్రదించాలని కోరారు. ఫిర్యాదు చేసేవారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.



ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట!

మొదటి పేజీ తరువాయి

వివిధ కార్యక్రమాలు, తీసుకున్న కీలక నిర్ణయాలను సీఎం రేవంత్ రెడ్డి వారికి సవివరంగా వివరించారు. సమాజంలో వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విద్య, ఉపాధి, ఆర్థిక అలాగే రాజకీయ రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా, మంత్రులుగా దళితులకు రాజకీయంగా సముచిత అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు వివిధ కార్పొరేషన్లలోనూ అనేక ఉన్నత అవకాశాలు కల్పించినట్లు ప్రస్తావించారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ వీసీగా తొలిసారిగా దళితుడికి అవకాశం కల్పించామని సీఎం గర్వంగా వెల్లడించారు. ఉస్మానియాతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐఐటీలలో కూడా ఎస్సీ, ఎస్టీలకే వీసీలుగా అవకాశాలు ఇచ్చామని వివరించారు. అర్హత, అవకాశం ఉన్న ప్రతీచోటా ఆ వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని గుర్తుచేశారు.

ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీలో పెద్దపీట

రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలోనూ ఎస్సీ, ఎస్టీలకే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చినట్లు సీఎం తెలిపారు. అలాగే సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి), ఆరోగ్యశ్రీ నిధులకు సంబంధించి 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణేనని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కాగా, రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం, 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రిని పార్లమెంటరీ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు రవి, తాపీర్ గావ్, హరీశ్ చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్ కుమార్, దగ్గుమల్ల ప్రసాద రావులతో పాటు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, పలువురు శాసనసభ్యులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



నగరానికి నీటి తిప్పలు

- ఎల్ నినో ప్రభావంతో పడిపోయిన భూగర్భ జలాలు
- బోర్లు ఎండిపోవడంతో అపార్ట్‌మెంట్లలో నీటి నియంత్రణ
- ట్యాంకర్ల కోసం ఎదురుచూపులు..
- వేసవి ముందే ముంచుకొస్తున్న నీటి సంక్షోభం

హైదరాబాద్, నవంబర్ 18 (ఉద్యమ కెటరం) : నగరంలోని వెస్ట్ సిటీలో నీటి కొరత తీవ్రరూపం దాల్చుతోంది. ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గిపోవడంతో బోర్లు ఎండిపోయాయి. ఐటీ సంస్థలు, భారీ గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల నివాస సముదాయాలతో విస్తరించిన ఈ ప్రాంతంలో పెరుగుతున్న జనాభాకు అవసరమైన నీటిని అందించడం కష్టంగా మారింది. గతంలో జలమండలి సరఫరా, బోర్ల నీటితో అవసరాలు తీరేవి. ప్రస్తుతం బోర్ల నుంచి నీరు అందకపోవడంతో జలమండలి సరఫరాపై ఆధారపడాల్సి వస్తోంది. అయినప్పటికీ ఆ నీరు అపార్ట్‌మెంట్ల అవసరాలకు సరిపోక ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. నవంబర్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వేసవిలో ఎదురయ్యే ఇబ్బందులను తలచుకుని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. నీటి లభ్యత తగ్గడంతో పలు అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు సరఫరా సమయాన్ని కుదిస్తున్నాయి. గతంలో రోజంతా అవసరానికి తగినట్లుగా నీటిని వినియోగించుకునే వెసులుబాటు ఉండగా, ప్రస్తుతం ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఆ సమయంలోనే రోజువారీ అవసరాలకు సరిపడా నీటిని నిల్వ చేసుకోవాలని సూచిస్తున్నారు. వంట, స్నానం, ఇతర గృహ అవసరాలకు నీటిని పొదుపుగా వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. నీటి వృథాను తగ్గించేందుకు మొక్కలకు నీరు పోయడాన్ని కూడా నిలిపివేశారు. ఒక వ్యక్తికి రోజుకు సగటున 130 లీటర్ల నీరు అవసరమని ప్రభుత్వ ప్రమాణాలు చెబుతున్నప్పటికీ, ప్రస్తుతం 30 నుంచి 40 లీటర్లతోనే సరిపెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని నివాసితులు చెబుతున్నారు. ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడుతున్న అపార్ట్‌మెంట్లకు సరఫరా సమస్యలు ఎదురవుతున్నాయి. అవసరానికి తగినన్ని ట్యాంకర్లు అందుబాటులో లేకపోవడం, ముందుగా బుక్ చేసుకున్నప్పటికీ నిర్ణీత సమయంలో చేరుకోకపోవడం ఇబ్బందులకు కారణమవుతున్నాయి. ట్యాంకర్ల సరఫరాపై విధించిన నియంత్రణలు కూడా సమస్యను తీవ్రతరం చేస్తున్నాయని నివాసితులు పేర్కొంటున్నారు. గతంలో రెండు రోజులకు సుమారు 2,000 లీటర్ల నీరు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం 500 నుంచి 700 లీటర్లకే పరిమితమవుతోందని వాపోతున్నారు. దీంతో ఉదయం పాఠశాలలకు వెళ్లే పిల్లలు, ఉద్యోగాలకు బయలుదేరే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ నీటి ట్యాంకర్‌కు రూ. 1,200 నుంచి రూ. 1,500 వరకు చెల్లించాల్సి వస్తుండటంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోంది.



నెలకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల ఆదాయం పొందే కుటుంబాలు ప్రతి రెండు, మూడు రోజులకు ట్యాంకర్ కొనుగోలు చేయడం ఆర్థికంగా భారంగా మారింది. అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు సైతం నీటి సరఫరా కోసం రోజూ ఎన్ని ట్యాంకర్లు అవసరమవుతున్నాయి, నెలవారీ వ్యయం ఎంత అనే వివరాలను నమోదు చేస్తున్నాయి. పరిస్థితి కొనసాగితే నిర్వహణ ఛార్జీలను పెంచాల్సి వస్తుందని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ నాటికి నీటి వనరులు మరింత తగ్గుతాయని భావించినప్పటికీ, నవంబర్‌లోనే తీవ్ర కొరత ఏర్పడిందని అపార్ట్‌మెంట్ వాసులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ వనరుల కోసం ప్రయత్నిస్తున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో జలమండలి, ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. నీటి సరఫరాను పెంచడంతో పాటు భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, శుద్ధి చేసిన మురుగునీటిని పునర్వినియోగించే విధానాలను విస్తృతంగా అమలు చేయాలని వెస్ట్ సిటీ నివాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాష్ట్ర ప్రగతికి జాతీయ గుర్తింపు

- ప్రత్యేక కేంద్ర ప్రోత్సాహకం సాధనలో తొలి రాష్ట్రంగా తెలంగాణ
- రైతులకు సులభతరమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): వ్యవసాయ రంగంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం (ఎస్ఏఎస్‌సీఐ) పథకం కింద రూ. 1,087.64 కోట్ల కేంద్ర ప్రోత్సాహక నిధులను సాధించి దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని వెల్లడించారు. రైతులకు మెరుగైన సేవలు అందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంలో సాధించిన పురోగతికి ఈ గుర్తింపు లభించిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైతుల నమోదు కార్యక్రమంలో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి రైతు గుర్తింపు సంఖ్యలను నమోదు చేసినందుకు రూ. 422.64 కోట్ల ప్రత్యేక సహాయ నిధులను ఫిబ్రవరి 26న కేంద్రం విడుదల చేసిందని మంత్రి వివరించారు. అలాగే 2026-27లో కేంద్ర ప్రభుత్వ ఎరువుల యాప్ ద్వారా పంపిణీ వ్యవస్థను విజయవంతంగా అమలు చేసినందుకు రూ. 665 కోట్ల ప్రోత్సాహక నిధులు మూడు విడతల్లో విడుదలయ్యాయని తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా రాష్ట్రానికి మొత్తం రూ. 1,087.64 కోట్లు లభించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎరువుల పంపిణీని సులభతరం చేసేందుకు మూడు దశల్లో నూతన విధానాన్ని అమలు చేశామని తుమ్మల తెలిపారు. తొలుత రెండు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి, అనంతరం సగం జిల్లాలకు విస్తరించి, చివరకు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసినట్లు చెప్పారు. రైతు నమోదు గుర్తింపు సంఖ్య ద్వారా రైతుల వివరాలు అందుబాటులో ఉండటంతో ఎరువుల పంపిణీతోపాటు పంటల కొనుగోలు ప్రక్రియ కూడా సులభమవుతోందన్నారు. కనీస మద్దతు ధరకు పంటలను విక్రయించేందుకు ఈ గుర్తింపు సంఖ్య ఉపయోగపడుతుందని వివరించారు. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన రైతు వంచర్ల అవినాష్ మాట్లాడుతూ రైతు గుర్తింపు సంఖ్యతో కొనుగోలు కేంద్రాల్లో పంటను సులభంగా విక్రయించగలుగుతున్నట్లు



తెలిపారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లింగగూడెం గ్రామానికి చెందిన రైతు వింజం శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ఎరువుల బుకింగ్ యాప్ ద్వారా అవసరమైన ఎరువులను సులభంగా పొందినట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో రాష్ట్రం సాధించిన పురోగతి వెనుక అధికారుల సమిష్టి కృషి ఉందని మంత్రి తుమ్మల అభినందించారు. కేవలం కేంద్ర నిధులు సాధించడమే కాకుండా వాటి ద్వారా రైతులకు వాస్తవ ప్రయోజనాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

నేడు సిద్ధిపేటకు సీఎం రేవంత్ రెడ్డి!

- రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం
- రూ.400 కోట్లతో రెండు సమీకృత గురుకుల పాఠశాలలకు శంకుస్థాపన
- కోటి ఇందిరమ్మ చీరల పంపిణీకి సిద్ధిపేట నుంచే శ్రీకారం
- కొమురవెల్లిలో భారీ బహిరంగ సభ.. ఏర్పాట్లు పూర్తి

కొమురవెల్లి, నవంబర్ 19 (సమయం న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి గురువారం సిద్ధిపేట జిల్లాలో పర్యటించనున్నారు. కొమురవెల్లిలో నిర్వహించే బహిరంగ సభలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించడంతోపాటు రూ. 544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం రూ. 451.13 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు రూ. 92.98 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేయనున్నారు. దుబ్బాక, సిద్ధిపేట నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. జిల్లాలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో రూ. 15.44 కోట్లతో అదనపు తరగతి గదులు, రూ. 13.50 కోట్లతో ఆరు తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. చిన్నకోడూరు మండలంలో రూ. 7.50 కోట్లు, దౌల్తాబాద్ మండలంలో రూ. 7.80 కోట్లతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్లతోపాటు జనగామ నియోజకవర్గంలో రూ. 6.89 కోట్లతో మూడు విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే సిద్ధిపేట జిల్లాలో రూ. 54.67 కోట్లతో నిర్మించిన 14 విద్యుత్ ఉపకేంద్రాలను ప్రారంభించనున్నారు. కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం రూ. 14.35 కోట్లతో నిర్మించిన వసతి సత్రం, రూ. 12 కోట్లతో నిర్మించిన క్యూ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. మరోవైపు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సిద్ధిపేట వేదికగా ప్రారంభించనున్నారు. మహిళలకు పుట్టింటి సారెగా కోటి చీరలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిలుకపచ్చ రంగులో రెండు ఆకర్షణీయమైన నమూనాలతో రూపొందించిన 9 మీటర్లు, 6.30 మీటర్ల చీరలను



పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే చీరలు జిల్లాలకు చేరుకున్నాయి. మహిళల గౌరవం, ఆత్మగౌరవం, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

సాగర్ నీళ్లపై కుట్ర

తెలంగాణకు తీరని అన్యాయం!

- నాగార్జునసాగర్ నుంచి 9 టీఎంసీల నీటి తరలింపునకు ఏపీ యత్నం
- ఏడాదిగా సారంగం తవ్వుతున్నా రేవంత్ ప్రభుత్వం మౌనం
- తాగునీటి పథకం ముసుగులో సాగునీటి తరలింపునకు కుట్ర
- చంద్రబాబు, మోదీలను ప్రసన్నం చేసుకునేందుకే రాష్ట్ర ప్రయోజనాల తాకట్టు
- కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులను కాపాడాల్సిందే
- అవసరమైతే న్యాయపోరాటం.. ప్రజా ఉద్యమం తప్పదు: కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): నాగార్జునసాగర్ నుంచి భారీ సొరంగం నిర్మించి తెలంగాణకు రావాల్సిన కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తాగునీటి పథకం పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా డెడ్ స్టోరేజ్ నుంచి తొమ్మిది టీఎంసీల నీటిని తరలించేందుకు కుట్ర జరుగుతోందని, ఏడాదిగా నిర్మాణ పనులు కొనసాగుతున్నా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మౌనం పాటిస్తోందని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ నీటి హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు సహకరిస్తోందని ఆరోపించారు. నాగార్జునసాగర్ వద్ద విజయపురి సౌత్ ప్రాంతంలో 510 అడుగుల దిగువన సొరంగం నిర్మించి, 1,650 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా తొమ్మిది టీఎంసీల నీటిని తరలించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ఏడాదిగా ఇంత భారీ నిర్మాణం జరుగుతున్నా ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి నిఘా, నీటిపారుదల శాఖల అధికారులు సమాచారం ఇవ్వలేదా అని నిలదీశారు. చంద్రబాబు నాయుడు, కేంద్ర ప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకునేందుకే తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని వ్యాఖ్యానించారు. గతంలో పోతిరెడ్డిపాడు ద్వారా శ్రీశైలం జలాలను తరలించినట్లే ఇప్పుడు నాగార్జునసాగర్ నుంచి నీటిని మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తాగునీటి అవసరాల కోసం మిగిలిన 40 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరుతూ బోర్డుకు లేఖ రాశారా అని ప్రశ్నించారు. హైదరాబాద్, పాలమూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాలకు ముప్పు ఏర్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర సాగునీటి సలహాదారుగా ఆదిత్యనాథ్ దాస్ నియామకంపైనా కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించిన వ్యక్తికి కీలక బాధ్యతలు ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు. ఈఎన్సీ రమేశ్‌బాబు పదవీకాలాన్ని పొడిగించడంపైనా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాల్సిన వ్యవస్థలో తీసుకుంటున్న నిర్ణయాలు అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నీటి కొరతపై ప్రభుత్వంలోనే పరస్పర విరుద్ధ ప్రకటనలు వస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. అక్టోబర్‌లో సుమారు 2.50 లక్షల వాటర్ ట్యాంకర్లు బుక్ అయ్యాయని, రోజుకు దాదాపు ఎనిమిది వేల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఒకవైపు నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు నీటి సమస్య లేదని మంత్రి ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు చారిత్రకంగా అన్యాయం జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో తెలంగాణకు 28 శాతం, ఆంధ్రప్రదేశ్‌కు 72 శాతం వాటా ఉందని పేర్కొన్నారు. పాలమూరు జిల్లాలో కృష్ణా నది సుమారు 300 కిలోమీటర్లు ప్రవహిస్తున్నా సాగునీటి విషయంలో అన్యాయం కొనసాగిందన్నారు. కేసీఆర్ హయాంలో పెండింగ్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించామని చెప్పారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కాలువల పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. నాగార్జునసాగర్ నుంచి ప్రతిపాదిత నీటి తరలింపును అడ్డుకునేందుకు ప్రభుత్వం వెంటనే కేఆర్ఎంబీని ఆశ్రయించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, రైతులు, ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. నల్గొండలో భారీ బహిరంగ సభ నిర్వహించడంతోపాటు మహబూబ్‌నగర్‌లోనూ ఉద్యమ కార్యాచరణ చేపడతామని ప్రకటించారు. తెలంగాణకు రావాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా వదులుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

భూముల వేలం నిర్ణయాన్ని విరమించుకోండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు
- 150 ఎకరాల్లో నివసిస్తున్న 15 వేల కుటుంబాల జోలికి రావద్దని హెచ్చరిక
- మిగిలిన 400 ఎకరాలను ప్రజా ప్రయోజనాలకు, లంగ్ స్పేస్‌గా అభివృద్ధి చేయాలి
- ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా లక్ష సంతకాల సేకరణ

హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): మియాపూర్‌లోని సర్వే నంబర్ 100, 101 పరిధిలో గల 550 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలం వేయాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు స్పష్టం చేశారు. మియాపూర్‌లోని ఎం.ఏ.నగర్, ప్రశాంత్ నగర్, స్టాలిన్ నగర్, దీప్తిశ్రీ నగర్ కాలనీలలో ఆయన బుధవారం పర్యటించి, తమ నివాసాలను కోల్పోతామన్న భయాందోళనలో ఉన్న స్థానిక ప్రజలతో మాట్లాడి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనేక ఏళ్లుగా న్యాయపరమైన చిక్కుల్లో ఉన్న ఈ 550 ఎకరాల భూమిపై ఇటీవల సుప్రీంకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములను వేలం వేయాలని చూడటం దారుణమన్నారు. ఇందులో దాదాపు 150 ఎకరాల భూమిలో 1983 నుండే అధికారిక రిజిస్ట్రేషన్లు, హెచ్ఎండీఏ అప్రూవ్ డ్ లేఅవుట్లు, బ్యాంకు రుణాల ద్వారా మధ్యతరగతి ప్రజలు నిర్మించుకున్న ఇళ్లు ఉన్నాయని ఆయన తెలిపారు. అలాగే జీవో నంబర్ 58, 59, 60ల కింద పేదలు క్రమబద్ధీకరించుకున్న 68 గజాల స్థలాలు, బస్తీలలో దాదాపు 10 నుండి 15 వేల కుటుంబాలు దశాబ్దాలుగా నివసిస్తున్నాయన్నారు. 30 ఏళ్లకు పైగా వారి స్వాధీనంలో ఉన్న ఈ 150 ఎకరాల భూమి, ఇళ్లు కచ్చితంగా ఆయా కుటుంబాలకే చెందాలని, ప్రభుత్వం వాటి జోలికి వెళ్లకూడదని ఆయన డిమాండ్ చేశారు. మిగిలిన 400 ఎకరాల భూమిని 2,500 నుండి 5,000 గజాల ప్లాట్లుగా విభజించి బహిరంగ వేలంలో అమ్మాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రామచందర్ రావు మండిపడ్డారు. ప్రభుత్వ భూములను అమ్మి ప్రభుత్వాన్ని నడపాలనుకోవడం అత్యంత ప్రమాదకరమైన ధోరణి అని విమర్శించారు. పెరుగుతున్న కాలుష్యం, పట్టణీకరణ నేపథ్యంలో హైదరాబాద్ నగరానికి 'లంగ్ స్పేసెస్' (స్వచ్ఛమైన గాలినిచ్చే ఖాళీ ప్రదేశాలు) ఎంతో అవసరమని అన్నారు. అందువల్ల ఈ 400 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టకుండా పార్కులు, ప్లే గ్రౌండ్స్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్పిటల్స్ నిర్మాణం వంటి ప్రజా ప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలని స్థానికుల పక్షాన బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రజా సంక్షేమం కంటే రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తే బీజేపీ ఊరుకోదని హెచ్చరించిన ఆయన ప్రజల హక్కులు, నివాసాలను కాపాడేందుకు అవసరమైతే న్యాయపోరాటం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ప్రభుత్వ భూముల వేలాన్ని నిరసిస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, స్వయంగా తానే మొదటి సంతకం చేసి ఈ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ప్రభుత్వానికి అందజేస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవి కుమార్ యాదవ్, మహిపాల్, తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలంగాణకు విస్తరించండి

- ముంబయి పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం
- ప్రతి సంస్థకు ప్రత్యేక అధికారితో పెట్టుబడుల ప్రక్రియకు సహకారం



ముంబయి, నవంబరు 18 : 'మీ ప్రధాన కార్యాలయం ముంబయిలోనే ఉంచుకోండి.. తయారీ, వ్యాపార విస్తరణ, అభివృద్ధి కార్యకలాపాలను తెలంగాణలో చేపట్టండి' అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముంబయి పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. తయారీ, సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యాపార విస్తరణకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోవాలని కోరారు. ముంబయిలోని వర్లీలో భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) సహకారంతో తెలంగాణ ప్రభుత్వం బుధవారం నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' రోడ్‌షోలో మంత్రి ప్రసంగించారు. సీఐఐ మహారాష్ట్ర రాష్ట్ర మండలి ఉపాధ్యక్షురాలు ఆర్తి కూచిభట్ల తెలంగాణ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. రెండు ప్రాంతాల మధ్య దశాబ్దాలుగా వాణిజ్య, వ్యాపార సంబంధాలు కొనసాగుతున్నాయంటూ తెలంగాణ, ముంబయి మధ్య తరతరాలుగా కొనసాగుతున్న అనుబంధాన్ని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తుత చేశారు. తెలంగాణకు చెందిన కార్మికులు, చేతివృత్తులవారు, వ్యాపారవేత్తలు ముంబయి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముంబయి పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని శ్రీధర్‌బాబు అన్నారు. సాంకేతిక రంగం, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు), డేటా సెంటర్లు, ఔషధ పరిశ్రమలు, వస్త్రాలు, దుస్తుల తయారీ, మీడియా, వినోద రంగాల్లో తెలంగాణలో విస్తృత అవకాశాలున్నాయని వివరించారు. రాష్ట్రంలోని పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యమున్న మానవ వనరులు, పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను వినియోగించుకుని వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవాలని ముంబయి పారిశ్రామికవేత్తలకు సూచించారు. డిసెంబరు 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో పాల్గొనాలని ఆహ్వానించారు. పెట్టుబడులకు వేగంగా అనుమతులు మంజూరు చేసే టీజీ-ఐపాస్ విధానాన్ని వివరించారు. ముంబయి నుంచి తెలంగాణకు వచ్చే ప్రతి సంస్థకు ప్రత్యేక అధికారిని కేటాయిస్తామని మంత్రి ప్రకటించారు. పెట్టుబడులపై తొలి చర్చల నుంచి సంస్థ కార్యకలాపాలు ప్రారంభించి ఆదాయం ఆర్జించే దశ వరకు ఆ అధికారి పూర్తి సహకారం అందిస్తారని హామీ ఇచ్చారు. పెట్టుబడిదారులకు అన్ని దశల్లో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముంబయిలోని పారిశ్రామిక, వ్యాపార సంస్థలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. ముంబయిలోని ఆర్థిక, కార్పొరేట్ రంగ బలాన్ని తెలంగాణలోని తయారీ సామర్థ్యాలు, అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక అవకాశాలతో అనుసంధానించడం ద్వారా పరస్పర ప్రయోజనాలు సాధించవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) వైస్ చైర్మన్, ఎండీ శశాంక్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి.అజిత్‌రెడ్డి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తెలంగాణ ప్రతినిధి బృందంలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు ముంబయికి చెందిన పలు కంపెనీల ప్రతినిధులతో విడివిడిగా సమావేశమయ్యారు. పెట్టుబడి ప్రతిపాదనలు, వ్యాపార విస్తరణ ప్రణాళికలు, పరస్పర భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు.



టాస్క్‌ఫోర్స్ సోదాలపై హైకోర్టు కన్నెర్ర!

- సాధారణ దుస్తుల్లో తనిఖీలు చేయడాన్ని ప్రశ్నించిన పిటిషనర్
- డీజీపీ, హోంశాఖ, పోలీస్ కమిషనర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీలకు నోటీసులు
- పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశం.. డిసెంబర్‌కు విచారణ వాయిదా

హైదరాబాద్, నవంబర్ 19 (సమయం న్యూస్): హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సోదాలు, తనిఖీల తీరుపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చట్టబద్ధమైన నిబంధనలు పాటించకుండా సోదాలు నిర్వహిస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై రాష్ట్ర హోంశాఖ, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీలకు నోటీసులు జారీ చేసింది. ఆరోపణలపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించింది. జస్టిస్ మాధవీదేవి ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. బోరబండకు చెందిన బి.బాలరాజ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పోలీసు దుస్తులు ధరించకుండా సాధారణ దుస్తుల్లో వచ్చి సోదాలు నిర్వహిస్తున్నారని పిటిషనర్ ఆరోపించారు. ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే తనిఖీలు చేపట్టి వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇటువంటి చర్యలు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎఫ్ఐఆర్ నమోదుకు ముందే ఏకపక్షంగా దర్యాప్తు చేపట్టడం భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023 నిబంధనలకు విరుద్ధమని వాదించారు. సంబంధిత వ్యక్తులకు తమ వాదన వినిపించే అవకాశం కల్పించకుండా, పారదర్శకత పాటించకుండా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సోదాల వారెంట్లు జారీ చేసే అధికారం న్యాయ మేజిస్ట్రేట్‌లకే ఉంటుందని, ఏసీపీ స్థాయి అధికారులు వాటిని జారీ చేయడం చట్టబద్ధం కాదని వాదించారు. ఈ వాదనలను పరిశీలించిన న్యాయస్థానం పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలపై ప్రతివాదులు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్‌కు వాయిదా వేసింది. అయితే టాస్క్‌ఫోర్స్ సోదాలు చట్టవిరుద్ధమని హైకోర్టు తుది నిర్ధారణ చేయలేదు. ఆరోపణలపై వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది.

కేటీఆర్ వ్యాఖ్యలు కృతజ్ఞతకు నిదర్శనం!

- తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని విమర్శిస్తారా?
- నాగార్జునసాగర్ నిర్మాణంలో నెహ్రూ కృషిని తక్కువ చేస్తారా?
- పదేళ్లలో కృష్ణా పరీవాహక ప్రాంతానికి బీఆర్ఎస్ చేసిందేమిటి?
- కేటీఆర్ ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలక నిర్ణయం తీసుకున్న సోనియా గాంధీని కేటీఆర్ విమర్శించడం కృతజ్ఞతకు నిదర్శనమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. సోనియా గాంధీ సంకల్పం లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదే కాదని, ఈ విషయాన్ని గతంలో కేసీఆర్ కూడా శాసనసభలో అంగీకరించారని గుర్తుచేశారు. బుధవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ చేసిన ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతే కేటీఆర్ కుటుంబానికి రాజకీయ పదవులు దక్కాయని, ఆ విషయాన్ని విస్మరించి సోనియా గాంధీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కృషిని కేటీఆర్ తక్కువ చేసి మాట్లాడటం విడ్డూరమని ఉత్తమ్ విమర్శించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కలిపి సుమారు 21 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న నాగార్జునసాగర్ ఒక అద్భుతమైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో రూ.1.83 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం అందుకు తగిన ఫలితాలు సాధించలేకపోయిందని ఆరోపించారు. పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్, ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సాగునీటి రంగంలో చేసిన వ్యయంలో 75 శాతం గోదావరి పరీవాహక ప్రాంతానికే కేటాయించి, కృష్ణా పరీవాహక ప్రాంతానికి కేవలం 25 శాతం వెచ్చించిందని మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కృష్ణా జలాల్లో 811 టీఎంసీలకు గాను ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించే నిష్పత్తికి బీఆర్ఎస్ ప్రభుత్వం అంగీకరించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం పరీవాహక ప్రాంతం, జనాభా, సాగునీటి అవసరాల ఆధారంగా తెలంగాణకు 555 టీఎంసీలు రావాలని ట్రైబ్యునల్ ముందు వాదిస్తోందని వివరించారు. బీఆర్ఎస్ పాలనలో ఆంధ్రప్రదేశ్ 4,464 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకోగా, తెలంగాణ వినియోగం 1,993 టీఎంసీలకే పరిమితమైందని ఉత్తమ్ తెలిపారు. ప్రస్తుత జల సంవత్సరంలో అక్టోబర్ 30 నాటికి ఏపీ 98.16 టీఎంసీలు వినియోగించుకోగా, తెలంగాణ 122.74 టీఎంసీలు వినియోగించుకుందని చెప్పారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును 2014లో ప్రకటించినప్పటికీ సమగ్ర ప్రాజెక్టు నివేదికను 2022లోనే సమర్పించారని, అనుమతుల సాధనలో జాప్యం కారణంగా ప్రాజెక్టు వ్యయం పెరిగిందని విమర్శించారు. నాగార్జునసాగర్ నుంచి సుమారు 1.8 టీఎంసీల నీటిని తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన తాగునీటి పథకంపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే తీవ్ర అభ్యంతరాలు తెలిపిందని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఏపీ ప్రభుత్వానికి అభ్యంతరాలను పంపినట్లు వెల్లడించారు. తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసే ఏ పథకాన్నైనా అడ్డుకుంటామని, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు.

సంపాదకీయం



నెమ్మదిగా కదిలే తుఫానులు

పెనువిపత్తుకు సంకేతాలా?

వేగం తక్కువైనా విధ్వంసం ఎక్కువయ్యే ప్రమాదం

ప్రకృతి విపత్తుల తీవ్రతను అంచనా వేయడంలో మనం ఇప్పటికీ కొన్ని అపోహల మధ్యనే ఉన్నాం. తుఫాను ఎంత వేగంగా కదులుతోంది? గాలులు ఎంత బలంగా వీస్తున్నాయి? అనే అంశాల ఆధారంగానే దాని ప్రమాదాన్ని అంచనా వేస్తుంటాం. కానీ నెమ్మదిగా కదిలే తుఫానులు కూడా అత్యంత ప్రమాదకరంగా మారవచ్చని వాతావరణ పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. బంగాళాఖాతంలో తుఫానుల ముప్పు నేపథ్యంలో ఈ అంశం మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. తుఫాను కదలిక మందగించడం ఒక్కటే దాని విధ్వంసక శక్తిని నిర్ణయించకపోయినా, ఒకే ప్రాంతంలో ఎక్కువసేపు ప్రభావం చూపడం వల్ల భారీ వర్షాలు, వరదలు సంభవించే ప్రమాదం పెరుగుతుంది. అందుకే తుఫాను వేగం కంటే దాని ప్రభావం ఎంతసేపు కొనసాగుతుందనే అంశాన్ని కూడా ప్రభుత్వాలు, ప్రజలు తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. సాధారణంగా తుఫాను వేగంగా ముందుకు కదిలితే ప్రభావిత ప్రాంతాన్ని తక్కువ సమయంలో దాటిపోతుంది. కానీ నెమ్మదిగా కదిలే తుఫాను ఒకే ప్రాంతంపై గంటల తరబడి, కొన్నిసార్లు రోజులపాటు ప్రభావం చూపుతుంది. ఫలితంగా ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతాయి. నదుల్లో నీటిమట్టాలు పెరిగి లోతట్టు ప్రాంతాలు జలమయమవుతాయి. వ్యవసాయ భూములు నీటమునిగి పంటలు దెబ్బతింటాయి. రహదారులు, విద్యుత్ వ్యవస్థలు, సమాచార సంబంధాలు స్తంభించే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా తీరప్రాంతాల్లో సముద్రపు అలల ఉద్ధృతి, భారీ వర్షాలు ఒకేసారి సంభవిస్తే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతుంది. తుఫానుల కదలికలు, వర్షపాతం మధ్య సంబంధంపై శాస్త్రవేత్తలు నిర్వహించిన పరిశోధనలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించాయి. 2021లో 'జర్నల్ ఆఫ్ హైడ్రోమెటియరాలజీ'లో ప్రచురితమైన అధ్యయనంలో 2010 నుంచి 2019 మధ్య తీరాన్ని దాటిన 280 ఉష్ణమండల తుఫానులను పరిశీలించారు. తుఫానుల కదలిక వేగం, వరదల తీవ్రత మధ్య సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. నెమ్మదిగా కదిలే తుఫానులు ఒకే ప్రాంతంలో ఎక్కువసేపు వర్షాలు కురిపించడం వల్ల మొత్తం వర్షపాతం పెరిగి వరదల ప్రమాదం అధికమవుతుందని అధ్యయనం సూచించింది. అయితే వేగంగా కదిలే తుఫానుల్లో వర్షపాతం తక్కువగా ఉంటుందని భావించడం కూడా సరికాదు. 2022లో 'నేచర్ కమ్యూనికేషన్స్'లో ప్రచురితమైన మరో పరిశోధనలో 2001 నుంచి 2020 మధ్య ఉపగ్రహాల ద్వారా సేకరించిన వర్షపాత సమాచారాన్ని విశ్లేషించారు. వేగంగా కదిలే ఉష్ణమండల తుఫానుల్లో సగటు వర్షపాతం రేటు నెమ్మదిగా కదిలే తుఫానులతో పోలిస్తే 24 శాతం ఎక్కువగా ఉన్నట్లు ఆ అధ్యయనం గుర్తించింది. దీన్నిబట్టి తుఫాను కదలిక వేగం, వర్షం కురిసే తీవ్రత, మొత్తం వర్షపాతం మూడు వేర్వేరు అంశాలని అర్థమవుతోంది. తక్కువ సమయంలో అత్యంత భారీ వర్షం కురవడం ఒక రకమైన ప్రమాదమైతే, ఎక్కువసేపు వర్షాలు కొనసాగడం మరో రకమైన ప్రమాదం. రెండింటినీ సమానంగా పరిగణించాల్సిందే. ఆంధ్రప్రదేశ్ వంటి సుదీర్ఘ తీరప్రాంతం కలిగిన రాష్ట్రాలకు తుఫానులు కొత్తేమీ కాదు. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫానుల ప్రభావం తరచూ కనిపిస్తూనే ఉంటుంది. ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో వ్యవసాయం, మత్స్యకార వృత్తి, తీరప్రాంత ఆర్థిక కార్యకలాపాలు వాతావరణ పరిస్థితులపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. తుఫాను హెచ్చరిక వెలువడినప్పుడల్లా మత్స్యకారుల జీవనోపాధి నిలిచిపోవడం, చేతికొచ్చిన పంటలు దెబ్బతినడం, రవాణా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడటం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రకృతి విపత్తు ముగిసిన తర్వాత కూడా బాధిత కుటుంబాలు సాధారణ స్థితికి చేరుకోవడానికి నెలల తరబడి సమయం పడుతోంది. మరోవైపు వాతావరణ మార్పులు తుఫానుల స్వభావంపై చూపుతున్న ప్రభావాన్ని విస్మరించలేం. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల తుఫానులకు అవసరమైన శక్తి లభించే అవకాశాలు పెరుగుతాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఎల్‌నినో వంటి ప్రపంచ వాతావరణ పరిణామాలు కూడా తుఫానుల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను ప్రభావితం చేయగలవు. అయితే ఒక నిర్దిష్ట తుఫానుకు ఎల్‌నినోనే కారణమని చెప్పాలంటే ప్రత్యేకమైన శాస్త్రీయ విశ్లేషణ అవసరం. ప్రతి తుఫానును వాతావరణ మార్పులకు నేరుగా ఆపాదించడం కంటే దీర్ఘకాలిక పరిశోధనల ఆధారంగా ప్రమాదాలను అంచనా వేయడం ముఖ్యం. ఇక్కడ ప్రభుత్వాల ముందున్న ప్రధాన సవాలు తుఫాను వచ్చిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం మాత్రమే కాదు. తుఫాను రాకముందే ప్రాణ, ఆస్తి నష్టాలను సాధ్యమైనంత వరకు నివారించడం. వాతావరణ శాఖ హెచ్చరికలను గ్రామస్థాయికి చేరవేయడం, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించడం, తుఫాను ఆశ్రయ కేంద్రాలను సిద్ధంగా ఉంచడం అత్యవసరం. చెరువులు, కాలువలు, మురుగునీటి పారుదల వ్యవస్థలను సక్రమంగా నిర్వహించడం కూడా వరద నష్టాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. తీరప్రాంతాల్లో మడ అడవుల పరిరక్షణ, పటిష్ఠమైన మౌలిక సదుపాయాల నిర్మాణం, శాస్త్రీయ ప్రణాళికల అమలు దీర్ఘకాలిక రక్షణకు అవసరం. ప్రకృతి విపత్తులను పూర్తిగా అడ్డుకోవడం మనిషి చేతుల్లో లేకపోవచ్చు. కానీ వాటి వల్ల సంభవించే నష్టాలను తగ్గించడం మాత్రం సాధ్యమే. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా అధికార యంత్రాంగం అప్రమత్తంగా లేకపోతే ముందస్తు హెచ్చరికల ప్రయోజనం ప్రజలకు అందదు. తుఫాను కదలికలపై నిరంతర నిఘా, శాస్త్రీయ అంచనాల ఆధారంగా నిర్ణయాలు, ప్రజల్లో అవగాహన, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం అత్యంత అవసరం.



ప్రపంచ నేతలకు మోదీ అపురూప కానుకలు

- ఫిలిప్పీన్స్ పర్యటనలో భారతీయ కళావైభవానికి పెద్దపీట
- ట్రంప్‌కు రాజస్థాన్ పిచ్వాయ్ చిత్రకళాఖండం
- ఫిలిప్పీన్స్ అధ్యక్షుడికి కశ్మీరీ పట్టు తివాచీ
- జపాన్ ప్రధానికి బనారసీ పట్టు శాలువా
- భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటిన బహుమతులు


మనీలా, నవంబర్ 18 (సమయం న్యూస్): భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటేలా ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ నేతలకు అపురూప బహుమతులు అందజేశారు. రెండు ప్రాంతీయ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొనేందుకు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా చేరుకున్న సందర్భంగా పలువురు దేశాధినేతలకు భారతీయ హస్తకళా నైపుణ్యాన్ని ప్రతిబింబించే కళాఖండాలను కానుకలుగా ఇచ్చారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ చిత్రకళ, శిల్పకళ, వస్త్ర కళాఖండాలను ఎంపిక చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రాజస్థాన్‌లో ప్రసిద్ధి చెందిన గోల్డెన్ పిచ్వాయ్ చిత్రకళాఖండాన్ని మోదీ బహూకరించారు. సంప్రదాయ వస్త్ర చిత్రకళకు ప్రతీకగా నిలిచే ఈ కళాఖండంలో బంగారు వర్ణాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణ. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌కు కశ్మీరీ పట్టు తివాచీని అందజేశారు. చేతితో నేసే ఈ తివాచీలు సున్నితమైన అల్లికలు, ఆకర్షణీయమైన నమూనాలకు ప్రసిద్ధి చెందాయి. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు చోళుల కాలం నాటి శిల్ప సంప్రదాయాన్ని ప్రతిబింబించే కాంస్య కళాఖండాన్ని బహూకరించారు. తొమ్మిదో శతాబ్దం నుంచి పదమూడో శతాబ్దం వరకు దక్షిణ భారతదేశంలో విలసిల్లిన చోళ శిల్పకళకు ఈ బహుమతి ప్రతీకగా నిలిచింది. కంబోడియా ప్రధాని హున్ మానెట్‌కు సంప్రదాయ ధోక్రా కళాత్మక పడవను అందజేశారు. మయన్మార్ అధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లైంగ్‌కు జింక్, రాగి మిశ్రమంతో రూపొందించే బిద్రీవేర్ లోహ కళాఖండాన్ని కానుకగా ఇచ్చారు. జపాన్ ప్రధాని సనాయే తకైచికి ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి ప్రసిద్ధ బనారసీ పట్టు శాలువాను అందజేశారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌కు రాజస్థాన్‌లోని జైపూర్ నీలిరంగు మట్టిపాత్ర కళాఖండాన్ని బహూకరించారు. ఈ బహుమతుల ద్వారా రాజస్థాన్, కశ్మీర్, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల సంప్రదాయ కళలకు అంతర్జాతీయ వేదికపై గుర్తింపు లభించింది. దౌత్య సంబంధాలతోపాటు భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నంగా మోదీ అందించిన కానుకలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్..

లష్కరే ఉగ్రవాది హతం!

భద్రతా బలగాల కాల్పుల్లో లతీఫ్ భట్ మృతి

మసీదులో దాక్కున్న ఉగ్రవాదిని గుర్తించిన బలగాలు



శ్రీనగర్, నవంబర్ 18 (సమయం న్యూస్): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత చర్యల్లో భాగంగా భద్రతా బలగాలు మరో ఉగ్రవాదిని మట్టుబెట్టాయి. కుల్గాం జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాకు చెందిన లతీఫ్ భట్ హతమయ్యాడు. ఓ మసీదులో దాక్కున్న అతడిని గుర్తించిన భద్రతా దళాలు ముందుగా లొంగిపోవాలని సూచించాయి. అయితే అందుకు నిరాకరించిన లతీఫ్ కాల్పులకు దిగడంతో బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఘటనలో అతడు మృతి చెందినట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. నవంబర్ 11న కుల్గాం జిల్లా అఖ్రాన్‌లోని సీఆర్పీఎఫ్ చెక్‌పోస్టుపై జరిగిన దాడిలో లతీఫ్ భట్‌కు కీలక పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆ దాడిలో ముగ్గురు సీఆర్పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారు. ఘటన అనంతరం ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు విస్తృతంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో సోమవారం ఉమర్ నిసార్ అనే ఉగ్రవాది ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. తాజాగా లతీఫ్ భట్ ఆచూకీ లభించడంతో కుల్గాంలో ప్రత్యేక గాలింపు చర్యలు నిర్వహించారు. మసీదులో దాక్కున్న లతీఫ్‌తో పోలీసులు, ఉన్నతాధికారులు వీడియో కాల్ ద్వారా మాట్లాడి లొంగిపోవాలని కోరినట్లు సమాచారం. 'నీకు ఇంకా జీవితం ఉంది.. నువ్వు చాలా చిన్నవాడివి' అంటూ నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయితే లొంగిపోయేందుకు నిరాకరించిన అతడు 'నేను అల్లాహ్‌ను కలవాలనుకుంటున్నాను' అని సమాధానమిచ్చినట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. తెల్లవారుజామున 2.45 గంటల సమయంలో బలగాలపై కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు జరిగాయని వెల్లడించాయి. లతీఫ్ భట్ హతమైన అనంతరం కూడా ఆ ప్రాంతంలో భద్రతా దళాల గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌పై జమ్మూకశ్మీర్ పోలీసులు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. 'మీరు పారిపోవచ్చు.. కానీ తప్పించుకోలేరు' అంటూ పోస్టు చేశారు. ఉగ్రవాద కార్యకలాపాలను అడ్డుకునేందుకు భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

బర్డ్‌ఫ్లూ నియంత్రణకు

తొలి స్వదేశీ టీకా

నేడు దేశానికి అంకితం



భోపాల్, నవంబర్ 18 (సమయం న్యూస్): దేశంలోని పౌల్ట్రీ పరిశ్రమను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న బర్డ్‌ఫ్లూ నియంత్రణ దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. హెచ్5ఎన్1 ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు తొలి స్వదేశీ టీకాను అభివృద్ధి చేసినట్లు వెల్లడైంది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ఐసీఏఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ శాస్త్రవేత్తలు ఈ టీకాను రూపొందించారు. నవంబర్ 20న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భోపాల్‌లో జరిగే కార్యక్రమంలో దీనిని జాతికి అంకితం చేయనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో తరచూ బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందడంతో పెద్ద సంఖ్యలో కోళ్లు, ఇతర పక్షులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పౌల్ట్రీ రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనే లక్ష్యంతో భోపాల్‌లోని పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు కొంతకాలంగా ప్రయోగాలు నిర్వహించి స్వదేశీ టీకాను అభివృద్ధి చేశారు. ఈ టీకా అందుబాటులోకి వస్తే బర్డ్‌ఫ్లూ నియంత్రణ చర్యలకు మరింత బలం చేకూరే అవకాశముందని భావిస్తున్నారు. అయితే టీకా వాణిజ్య ఉత్పత్తి, మార్కెట్‌లో విడుదల, రైతులకు అందుబాటులోకి వచ్చే తేదీలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. టీకా వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలు వెల్లడైన తర్వాతే పౌల్ట్రీ పరిశ్రమకు కలిగే ప్రయోజనాలపై పూర్తి స్పష్టత రానుంది.

నావికాదళానికి మరింత రక్షణ కవచం!

బరాక్ క్షిపణుల ఆధునికీకరణకు భారత్ కీలక ఒప్పందం

ఇజ్రాయెల్ సంస్థతో రూ.1,976 కోట్ల భారీ ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్): భారత నావికాదళ రక్షణ సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యుద్ధనౌకలపై అమర్చిన బరాక్ పాయింట్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థలను ఆధునికీకరించేందుకు ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) సంస్థతో రూ.1,976.40 కోట్ల విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం న్యూఢిల్లీలో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో ఇరుపక్షాల అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత నావికాదళ యుద్ధనౌకల్లోని బరాక్ క్షిపణి వ్యవస్థల హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను సమగ్రంగా ఆధునికీకరించనున్నారు. కాలం చెల్లిన సాంకేతిక పరికరాల స్థానంలో అధునాతన విడిభాగాలను అమర్చడంతోపాటు వ్యవస్థల పనితీరును మెరుగుపరచనున్నారు. తద్వారా శత్రు దేశాల క్షిపణులు, యుద్ధ విమానాలు, ఇతర గగనతల ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యం మరింత పెరుగుతుందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి. సముద్ర జలాల్లో విధులు నిర్వహించే యుద్ధనౌకలకు బరాక్ క్షిపణి వ్యవస్థ కీలక రక్షణ కవచంగా పనిచేస్తోంది. ఆకస్మిక గగనతల దాడులను గుర్తించి అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తుంది. తాజా ఆధునికీకరణతో క్షిపణి రక్షణ వ్యవస్థల విశ్వసనీయత, నిర్వహణ సామర్థ్యం పెరగనున్నాయి. సముద్ర భద్రతకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో భారత్–ఇజ్రాయెల్ రక్షణ సహకారంలో ఈ ఒప్పందం మరో కీలక ముందడుగుగా నిలవనుంది.





జంతుబలుల నిషేధానికి సుప్రీంకోర్టు నో!

మతపరమైన వేడుకల్లో జంతువధను నిషేధించాలంటూ పిటిషన్

పిటిషనర్ వాదనలు విన్న అనంతరం వ్యాజ్యం కొట్టివేత

న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్): మతపరమైన వేడుకలు, ఆలయాల్లో జంతుబలులను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. న్యాయవాది శృతి బిష్త్ దాఖలు చేసిన ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఆర్. మహాదేవన్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ వాదనలు విన్న అనంతరం వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ నిర్ణయం తీసుకుంది. దేశంలోని పలు ప్రాంతాల్లో మతం పేరుతో జంతుబలులు కొనసాగుతున్నాయని పిటిషనర్ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. జంతు హింస నిరోధక చట్టం--1960లో మతపరమైన ఆచారాలకు కల్పించిన మినహాయింపులను సవరించాలని కోరారు. మతపరమైన కార్యక్రమాల పేరిట జంతువులను చంపడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద జీవించే హక్కుకు విరుద్ధమని వాదించారు. జంతుబలులను నిషేధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఈ అభ్యర్థనను సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. పిటిషన్ కొట్టివేతకు సంబంధించిన పూర్తి కారణాలు ఉత్తర్వుల్లో వెల్లడికావాల్సి ఉంది.

సాగర్ నుంచి 90 టీఎంసీల నీటి తరలింపును అడ్డుకోవాలి

- **తెలంగాణ నీటి హక్కులపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి: కేటీఆర్**

హైదరాబాద్, నవంబర్ 18

తాగునీటి అవసరాలకే నీటి కొరత తీవ్రంగా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ 90 టీఎంసీల కృష్ణా జలాలను తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలను తెలంగాణ ప్రభుత్వం ఎలా సమర్థిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.నాగార్జునసాగర్ నుంచి నీటిని తరలించే ప్రయత్నాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో, కేఆర్ఎంబీని ఆశ్రయించిందా లేదా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు కేటాయించిన నీటిలో తాగునీటి అవసరాలకు ఎంత నీటిని కేటాయించారు? శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఎంత నీటిని నిల్వ ఉంచుతున్నారు? అనే అంశాలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.కృష్ణా జలాల విషయంలో కేఆర్ఎంబీ వద్ద తెలంగాణ హక్కులను కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారా? ఏపీ నీటి తరలింపుపై కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశారా? తెలంగాణకు మిగిలిన 40 టీఎంసీలను తాగునీటి అవసరాలకు కేటాయించాలని కోరుతూ లేఖ రాశారా? అని ప్రశ్నించారు.“సాగర్‌ను ఇష్టానుసారంగా దోచుకుంటామంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో ఎలాంటి మొహమాటాలు ఉండవు” అని కేటీఆర్ స్పష్టం చేశారు.కేఆర్ఎంబీ వెంటనే స్పందించి ఏపీ చేపడుతున్న నీటి తరలింపు ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ తరపున కేఆర్ఎంబీకి లేఖ రాయడంతో పాటు అవసరమైతే న్యాయపోరాటం, ప్రజా ఉద్యమం చేపడతామని ప్రకటించారు.తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు రాష్ట్ర నీటి హక్కుల విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కేఆర్ఎంబీ నుంచి తగిన ఆదేశాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు.నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ప్రజలను చైతన్యపరిచి నీటి హక్కుల కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని కేటీఆర్ తెలిపారు. , కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో జరుగుతున్న నీటి వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని కేటీఆర్ స్పష్టం చేశారు.కావాలంటే దీనిని ఇంకా 8-10 లైన్లలో “బ్రేకింగ్ న్యూస్” స్టైల్‌లో కూడా తయారు చేస్తాను.

అనారోగ్య బాధితులకు ఆపన్నహస్తం..

- **రూ.2.65 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ సాయం**
- **వైద్య ఖర్చుల భారానికి ఊరట.. ఆరుగురికి ఆర్థిక చేయూత**
- **29వ డివిజన్‌లో రూ.2.65 లక్షల విలువైన చెక్కులను అందజేసిన కౌన్సిలర్ వేముల సంధ్య, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ వేముల సాంబయ్య గౌడ్**



నర్సంపేట, నవంబర్ 18 (సమయం న్యూస్) :

అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలిచింది. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో 29వ డివిజన్‌కు చెందిన ఆరుగురికి మంజూరైన రూ.2.65 లక్షల విలువైన చెక్కులను కౌన్సిలర్ వేముల సంధ్య, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ వేముల సాంబయ్య గౌడ్ అందజేశారు.ఈ సందర్భంగా కక్కర్ల రాజుకు రూ.60 వేలు, బొప్పరాతి విజయకు రూ.1.18 లక్షలు, సొరపు రంజిత్‌కు రూ.45 వేలు, సుందరగిరి శ్రీమాతకు రూ.15 వేలు, దోమకుంట్ల ప్రకాష్‌కు రూ.17 వేలు, మాసాని స్వామికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కష్ట కాలంలో ప్రభుత్వ సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని కౌన్సిలర్ వేముల సంధ్య, సాంబయ్య గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల సారంగం గౌడ్, పట్టణ కార్యదర్శి నాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జిజుల కార్తిక్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కటారి ఉత్తమ్ కుమార్, పట్టణ నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, దోమడి కుమారస్వామి గౌడ్, కోయడి కిరణ్ గౌడ్, పాల్గొన్నారు.

బాల్యం అందంగా ఉండాలి.. భవిష్యత్తు ఆనందంగా వెలగాలి

- **చిన్నారుల చిరునవ్వులే సమాజానికి నిజమైన సంపద... డా.అనితా రెడ్డి**
- **బాల్యానికి భద్రత.. హక్కులతో పాటు బాధ్యతలూ ముఖ్యం**
- **పిల్లలే దేశ భవిష్యత్తు.. వారి రక్షణ మనందరి బాధ్యత**

హనుమకొండ, నవంబర్ 18 (సమయం న్యూస్)



బాల్యం భయాలకు, అభద్రతకు దూరంగా ఆనందానికి, ఆత్మవిశ్వాసానికి నిలయంగా ఉండాలని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 18న హనుమకొండ బాలసముద్రంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్, ఆనంద నిలయంలోని పిల్లలకు బాలల హక్కుల పరిరక్షణ, బాలల అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడటం ఒక్కరి బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రతి బిడ్డకు రక్షణ, భద్రతతో పాటు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలకు హక్కుల గురించి తెలియజేయడంతో పాటు బాధ్యతలను కూడా నేర్పించాలని సూచించారు. బాలలే దేశ సంపదని, వారే రేపటి భవిష్యత్తు పౌరులని పేర్కొన్నారు.విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని, పరిసర ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొందరు బాలలు మాదకద్రవ్యాలకు అలవాటు పడటం ఆందోళనకరమని, వాటికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని హితవు పలికారు. ప్రభుత్వం పిల్లల విద్య కోసం ఎంతో ఖర్చు చేస్తోందని, ప్రతి ఒక్కరూ పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని పిల్లలందరికీ డాక్టర్ అనితా రెడ్డి ఉచితంగా రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ నిర్వాహకులు సరిత, రాఘవ, విద్యార్థులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే హెచ్–143 వికారాబాద్

జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- **రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా వి. శ్రీనివాసరావు నియామకం.. రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా కొత్త శ్రీనివాస్ ఎన్నిక**

పరిగి, నవంబర్ 18 (సమయం న్యూస్):



తాండూరులో మంగళవారం నిర్వహించిన టీయూడబ్ల్యూజే హెచ్-143 నియోజకవర్గ ఎన్నికల సమావేశంలో వికారాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు సయ్యద్ ఆసిఫ్ హుసేన్, జిల్లా అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి ప్రహ్లాద చారి పాల్గొన్నారు.ఈ సందర్భంగా విజన్ ఆంధ్ర వికారాబాద్ జిల్లా బ్యూరో వి. శ్రీనివాసరావును టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా అధికారికంగా ప్రకటించారు.అదేవిధంగా తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల యూనియన్ (టెంజు) వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పరిగి ఎన్టీవీ రిపోర్టర్ కొత్త శ్రీనివాస్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శిగా ఐ న్యూస్ పరిగి రిపోర్టర్ ఒరిజినల్ పర్షమోని బాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రాజ్ న్యూస్ రిపోర్టర్ జ్యోతిర్లింగం గౌడ్ ఎన్నికయ్యారు.టీయూడబ్ల్యూజే హెచ్-143 జిల్లా ఉపాధ్యక్షుడిగా మహా న్యూస్ రిపోర్టర్ పండాల సురేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సీవీఆర్ రిపోర్టర్ కంటికి రఘు, సహ కార్యదర్శిగా పూడూరు నవతెలంగాణ రిపోర్టర్ రమేష్‌ను ఎంపిక చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా పరిగి 1టీవీ రిపోర్టర్ టి. దుర్గాప్రసాద్, పరిగి ఉదయం రిపోర్టర్ శ్రీశైలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన నాయకులు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు, ఐక్యతను బలోపేతం చేయడానికి కృషి చేయాలని సమావేశంలో ఆకాంక్షించారు.

అర్హతే ప్రామాణికం.. ప్రతీ పేదవాడికి సంక్షేమ ఫలం!

- **వరంగల్ పశ్చిమలో 2,698 మందికి చేయూత ఆసరా పెన్షన్ల మంజూరు పత్రాలు**
- **కులం, మతం, పార్టీలకు అతీతంగా పథకాల అమలు**
- **దళారులకు తావులేదు.. ఒక్క రూపాయి అడిగినా సహించేది లేదు...ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

హన్మకొండ, నవంబర్ 18 (సమయం న్యూస్) :



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కులం, మతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలనలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కొత్తగా అర్హత పొందిన 2,698 మంది లబ్ధిదారులకు చేయూత ఆసరా పెన్షన్ల మంజూరు పత్రాలను బుధవారం కాళోజీ కళాక్షేత్రంలో పంపిణీ చేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అర్హులను గుర్తించి వారి ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లు అందించే విధానానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డివిజన్‌కు పరిమిత సంఖ్యలోనే పెన్షన్లు మంజూరు చేసి ప్రజల అవసరాలను విస్మరించారని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ కార్యక్రమాలతో పేదల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నామని చెప్పారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, మిగిలిన అర్హులకు కూడా విడతల వారీగా ఇళ్లు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఇంటి స్థలం ఉన్న అర్హులకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని, పేదల గృహ అవసరాలను తీర్చేందుకు టవర్ల నిర్మాణానికి కూడా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.పెన్షన్ల మంజూరులో ఎలాంటి రాజకీయ వివక్ష ఉండదని, ఏ పార్టీకి చెందిన వారైనా అర్హత ఉంటే ప్రభుత్వ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు.సంక్షేమ పథకాల కోసం ఎవరైనా ఒక్క రూపాయి అడిగినా సహించేది లేదని హెచ్చరించారు. దళారుల ప్రమేయం లేకుండా పథకాల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారులకు చేరాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తన క్యాంపు కార్యాలయానికి లేదా స్థానిక ప్రజాప్రతినిధుల కు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఇప్పటికే పెన్షన్లు మంజూరైన వారితో పాటు అర్హత ఉండి ఇంకా పెన్షన్ రాని వారు ఆందోళన చెందవద్దని, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండు మూడు రోజులు ఆలస్యమైనా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కుడా చైర్మన్ గుండు సుధారాణి, ఏనుమాముల మార్కెట్ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న నాయక్, డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌ను ఆదర్శ నియోజకవర్గంగా

- **మంత్రి పొన్నం ప్రభాకర్**

సిద్దిపేట దివ్యాంగులు, వయోవృద్ధులకు అర్హత మేరకు ఉచిత సహాయ ఉపకరణాలు అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అక్కన్నపేటలో అలింకో ఆధ్వర్యంలో నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.అక్కన్నపేట-హుస్నాబాద్ నాలుగు లైన్ల రహదారి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు.హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొన్నారు. సవంబర్ 19న సిద్దిపేటలో ఇందిరమ్మ చీరల పంపిణీతో పాటు దేశంలోనే తొలిసారిగా ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా పథకం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హుస్నాబాద్ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.



భారత్ ఆర్థిక సంక్షోభం దిశగా పయనం

- **రాహుల్ గాంధీ**

న్యూయార్క్: భారత్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కొలంబియా యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన భారత ఆర్థిక వ్యవస్థ, నిరుద్యోగం, విద్యావ్యవస్థపై వ్యాఖ్యలు చేశారు.దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, చదువుకున్న యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు లభించడం లేదని పేర్కొన్నారు. యువతలో భవిష్యత్తుపై భరోసా తగ్గుతోందన్నారు. అలాగే 2024 ఎన్నికల ఓటర్ల జాబితా నుంచి 14 కోట్ల మంది ఓటర్లను తొలగించారంటూ ఆరోపించిన రాహుల్.. ఎన్నికల సంస్కరణలు అవసరమని అన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందిస్తూ, విదేశీ వేదికలపై భారత ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యంపై విమర్శలు చేయడం సరికాదని మండిపడ్డారు. దీంతో ఈ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.



చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేస్తాం

- **పిఏసీఎస్ చైర్మన్ శివమార్ గుప్తా,మండల అధ్యక్షులు సంజీవరెడ్డి**
- **పిఏసీఎస్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం**

కొడంగల్ మండలం, నవంబర్,18(సమయం న్యూస్)



రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా రైతులకు అండగా నిలుస్తూ ముందుకు సాగుతున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని పిఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, కొడంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డిలు అన్నారు.హస్నాబాద్ గ్రామంలో మంగళవారం పిఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ...రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు.రైతుల కష్టానికి తగిన గుర్తింపు, వారి పంటకు గిట్టుబాటు ధర అందించడమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తుందన్నారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ రెడ్డి, కొడంగల్ మండల ఉపాధ్యక్షులు బాలరాజ్ ,కొడంగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, హస్నాబాద్ గ్రామ సర్పంచ్ తూర్పు పద్మమ్మ, ఉపసర్పంచ్ గోపాల్ ఆనంద్, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

- **అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు**
- **అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భద్రత: కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి, నవంబర్ 18



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.నవంబర్ 19 నుంచి ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. రేషన్ కార్డు లేని కుటుంబాలు కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. డేటా అందుబాటులో లేదనే కారణంతో ఏ ఒక్క అర్హుడినీ వెనక్కి పంపరాదని స్పష్టం చేశారు. క్యాంపుల్లో అవసరమైన సాంకేతిక పరికరాలు, హెల్ప్‌డెస్క్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే పథకం లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.

కామినేని ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే

బొంరస్ పేట మండలం, నవంబర్,18(సమయం న్యూస్)

ఇటీవల నందర్పూర్ సమీపంలో జరిగిన కారు-ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పోలేపల్లి బీఆర్ఎస్ అధ్యక్షులు బుగ్గప్ప సోదరుడు హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి బాధితుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే వెంట తాలూకా పరిషత్ ప్రెసిడెంట్ మడిగే శ్రీనివాస్, దుద్యాల మండల బీఆర్ఎస్ యువజన అధ్యక్షులు లగచర్ల సురేష్ తదితరులు ఉన్నారు.



డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్

ఖమ్మం, నవంబర్ 18(సమయం న్యూస్)

మధిర పట్టణంలోని రెడ్డి గార్డెన్స్ లో బుధవారం రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ తో కలిసి, తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026కు సంబంధించిన లోగో, మస్కట్, బ్రోచర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, ప్రతిష్టాత్మకమైన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్రానికి దక్కిన గొప్ప గౌరవమని అన్నారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 విజయవంతానికి క్రీడాకారులు, క్రీడాభిమానులు, యువత, ప్రజలందరూ భాగస్వాములు కావాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల అధికారి తుంబూరు సునీల్ కుమార్, ఇంచార్జ్ డీఆర్డీవో శిరీష, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. పురందర, జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సాధినేని సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మత్కెపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మధిర మున్సిపల్ కమిషనర్ సామ్యూల్, అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వికలాంగుల సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం

- **బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇండ్లలో 5 శాతం కేటాయింపునకు విజ్ఞప్తి**

మల్కాజిగిరి, సమయం



వికలాంగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ అండ్ కమిషనర్ వి. విశ్వేశ్వర్ రెడ్డికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. సమితి జిల్లా అధ్యక్షుడు ఎన్. విలన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.జీవో ప్రకారం ఇందిరమ్మ ఇండ్లలో 5 శాతం వికలాంగులకు మంజూరు చేయాలి.సబ్సిడీతో సంబంధం లేకుండా రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వాలి.చదువుకున్న నిరుద్యోగ వికలాంగులకు ఉపాధి హామీ పథకం కింద రుణాలు ఇచ్చి ఆదుకోవాలి డిసెంబర్ 3న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించాలి.వికలాంగుల హక్కుల కోసం పోరాడుతున్న సంఘాల నాయకులను గుర్తించి, ప్రశంసా పత్రాలు, మెమెంటోలతో సత్కరించాలి.తమ సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని సమితి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

బాలికపై లైంగిక వేధింపులు నిందితుడికి 3 ఏళ్ల జైలు

- **రూ.6 వేల జరిమానా; బాధితురాలికి రూ.50 వేల పరిహారం**

మల్కాజ్ గిరి, సమయం

మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి మేడ్చల్ ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు మూడేళ్ల సాధారణ జైలు శిక్ష విధించింది. రూ.6,000 జరిమానాతో పాటు, బాధితురాలికి రూ.50,000 పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి కె. వెంకటేష్ ఆదేశించారు.దమ్మాయిగూడ మారుతీనగర్‌కు చెందిన మిట్టపల్లి వందేమాతరం అలియాస్ ప్రవీణ్ రెడ్డి (41) దోషిగా తేలాడు. జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో 2019లో నమోదైన క్రైమ్ నం. 2019 కేసులో ఐపీసీ 354, 354ఏ, పోక్సో చట్టం సెక్షన్ 7 రెడ్ విత్ 8 కింద అభియోగాలు నమోదయ్యాయి.2019 సెప్టెంబర్ 9న సాయంత్రం ఇంటి సమీపంలోని దుకాణానికి వెళ్లిన 17 ఏళ్ల బాలికను, అక్కడ మరెవరూ లేకపోవడంతో దుకాణ యజమాని అయిన నిందితుడు బలవంతంగా స్టోర్‌రూమ్‌లోకి లాక్కెళ్లి వేధించాడు. బాలిక ప్రతిఘటించి తప్పించుకునే ప్రయత్నం చేయగా దాడి చేశాడు. బాలిక తల్లి అక్టోబర్ 27న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.అదే రోజు నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు, ఘటనాస్థలి పంచనామా నిర్వహించి, సాక్ష్యుల వాంగ్మూలాలు నమోదు చేశారు. బాధితురాలు మైనర్ అని ధృవీకరణ పత్రంతో నిర్ధారించారు. సీఆర్‌పీసీ 164 ప్రకారం మేజిస్ట్రేట్ ఎదుట బాలిక వాంగ్మూలం నమోదు చేయించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.దర్యాప్తు అధికారి, సబ్‌ఇన్‌స్పెక్టర్ డి. మోహన్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. ప్రభాకర్ రెడ్డి కృషితో నిందితుడికి శిక్ష పడిందని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అధికారులు తెలిపారు.

వృత్తి నైపుణ్యాలతోనే ఉజ్వల భవిష్యత్తు

- **ఓజేటీ శిక్షణతో ఉపాధికి బాటలు ఆసుపత్రుల్లో విద్యార్థుల శిక్షణను పరిశీలించిన డీఐఈఓ డా.శ్రీధర్ సుమన్**

నర్సంపేట, నవంబరు 18 (సమయం న్యూస్)



చదువుతోపాటు క్షేత్రస్థాయిలో వృత్తి నైపుణ్యాలు అలవర్చుకోవడం ద్వారా విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డా. శ్రీధర్ సుమన్ అన్నారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సుల్లో భాగంగా నిర్వహించే ఆన్ జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ) విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు.బుధవారం నర్సంపేట పట్టణంలోని పలు ఆసుపత్రులను సందర్శించి ఎస్.ఆర్. ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు పొందుతున్న ఓజేటీ శిక్షణను ఆయన పరిశీలించారు. విద్యార్థుల పనితీరు, హాజరు పట్టికలు, రోజువారీ శిక్షణ రికార్డులు, ప్రాక్టికల్ అనుభవాలను సమీక్షించారు.ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు ఒకేషనల్ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ తప్పనిసరని తెలిపారు. శిక్షణలో పొందిన అనుభవాలు, సమర్పించిన రికార్డుల ఆధారంగా మార్కులు కేటాయిస్తారని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.ఆసుపత్రుల్లోని ఓపీ వార్డు, క్రిటికల్ కేర్ వార్డు, ల్యాబొరేటరీలు, రిపోర్టింగ్ సెల్, ఐసీయూ తదితర విభాగాల్లో విద్యార్థులు పొందుతున్న శిక్షణను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ ఆసక్తితో కొత్త విషయాలను నేర్చుకుంటూ, వాటిని శిక్షణ రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.ఆర్. ఒకేషనల్ జూనియర్ కళాశాల చైర్మన్ కొయ్యడి సనత్‌కుమార్, ప్రిన్సిపాల్ కొయ్యడి శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సూరయ్య, రమేష్ నాయక్, వెంకన్న, నాగేష్, కుమార్, దేవసింగ్, హరిభూషణ్, ప్రవీణ్, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా .....

- **పథకం ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 18:-



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం విధివిధానాలు, అమలు, లబ్ధిదారుల నమోదు ప్రక్రియ, ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక సహాయక కేంద్రాలు, నమోదు శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దరఖాస్తు పత్రాలు, నమూనా పత్రాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులందరికీ పథకంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.సంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సబ్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు కలెక్టర్ పాండు, జడ్పీసీఈఓ జానకిరెడ్డి, అదనపు డీఆర్డీఓ సూర్యారావు, జిల్లా పంచాయతీ అధికారి మోహన్ రెడ్డి, ఈడీఎం ఉదయ్ పాల్గొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో పథకం అమలుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 18 నుంచి 59 ఏళ్ల వయసున్న వారికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో విడతల వారీగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్హుల నుంచి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలను సేకరించాలని సూచించారు. బీమా పొందేవారు నామినీ వివరాలను స్పష్టంగా తెలియజేయాలని, దరఖాస్తు పత్రంలో తప్పనిసరిగా సంతకం చేయాలని సూచించారు. ప్రత్యేక శిబిరాల వద్ద పథకం వివరాలతో కూడిన ప్రచార ఫ్లెక్సీలు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వివరాల నమోదుకు కంప్యూటర్లు, అవసరమైన సాంకేతిక పరికరాలు, సిబ్బందితో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. శిబిరాలను ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తుల నమోదుకు అవసరమైన సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలకు దరఖాస్తులు నింపడంలో సహకారం అందించాలన్నారు. అర్హుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రక్రియలో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు, ఎంపీడీఓలు సమన్వయంతో వ్యవహరించి ప్రతి గ్రామంలో ముందస్తుగా ప్రజలకు పథకంపై అవగాహన కల్పించాలని తెలిపారు.సాంకేతిక సదుపాయాలు, ఇతర సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధుల సహకారంతో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకంలో నమోదు చేసుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు విజ్ఞాన వేదికలు

- **ఆధునిక రీడింగ్ హాల్, ఆడిటోరియం ప్రారంభం**
- **గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి...ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

హనుమకొండ, నవంబర్ 18 (సమయం న్యూస్)



విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విజ్ఞానాన్ని అందించి, వారి భవిష్యత్తుకు బాటలు వేసే లక్ష్యంతో గ్రంథాలయాల్లో ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక రీడింగ్ హాల్, ఆడిటోరియంను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు కేవలం పుస్తక పఠన కేంద్రాలే కాకుండా విద్యార్థులు, యువత జీవితాలకు దిశానిర్దేశం చేసే విజ్ఞాన నిలయాలని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఆధునిక సదుపాయాలతో కూడిన రీడింగ్ హాల్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు, వసతులను వినియోగించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ప్రజలకు మెరుగైన విద్యా, విజ్ఞాన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

పేదింటి బిడ్డకు పెద్ద మనసుతో వైద్య భరోసా

- **వైద్యానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం**
- **ఒక్కరోజులోనే ఎల్ఓసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**
- **దేవోజు సదానందం చొరవతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే 'దొంతి'**

నర్సంపేట, నవంబరు 18 సమయం న్యూస్)



ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా నిలిచి, మెరుగైన వైద్య చికిత్సకు భరోసా కల్పించారు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి. తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బెజ్జంకి తరుణ్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు.పట్టణంలోని విశ్వకర్మ సామాజికవర్గానికి చెందిన బెజ్జంకి అచల, రాజేష్ దంపతుల కుమారుడు తరుణ్ ఇటీవల మెదడులో రక్తం గడ్డకట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మెరుగైన వైద్యం కోసం తల్లిదండ్రులు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సకు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో ఆర్థిక స్థోమత లేని కుటుంబం ఆందోళనకు గురైంది. ఈ విషయం తెలుసుకున్న నర్సంపేట పట్టణ విశ్వకర్మ మాజీ అధ్యక్షుడు దేవోజు సదానందం స్పందించి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అయితే రేషన్ కార్డులో పేరు లేకపోవడంతో వైద్య సాయం పొందేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి ఒక్కరోజులోనే రేషన్ కార్డులో తరుణ్ పేరును చేర్పించడంతోపాటు వైద్య చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసీ చెక్కును బుధవారం దేవోజు సదానందం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. తమ కష్ట సమయంలో స్పందించి వైద్య సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, దేవోజు సదానందానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కొడంగల్ మున్సిపల్,ఎంపీడీఓ కార్యాలయంలో

- **లబ్ధిదారులకు కొత్త పింఛన్ల ప్రొసీడింగ్స్ అందజేసిన మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,కమిషనర్ బలరాం నాయక్**

కొడంగల్ మున్సిపల్ నవంబర్ 18(సమయం న్యూస్)



కొడంగల్ మున్సిపల్ కార్యాలయం మరియు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తో కలిసి లబ్ధిదారులకు స్వయంగా తన చేతుల మీదుగా కొత్త పింఛన్ల ప్రొసీడింగ్స్ అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ నందారం ప్రశాంత్ మాట్లాడుతూ, పేదలు, వృద్ధులు, దివ్యాంగులు మరియు అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించడమే చేయూత పింఛన్ల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, వివిధ వార్డుల కౌన్సిలర్లు,కోఅప్షన్ మెంబర్లు, మండల నాయకులు,సర్పంచులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

కేకేఆర్ వాటా విక్రయానికి రంగం సిద్ధం



- 400 మిలియన్ డాలర్లకు భారీ డీల్!
- 22.5 శాతం వాటాను విక్రయించేందుకు జయ్ మెహతా సన్నాహాలు
- అమెరికా పెట్టుబడుల సంస్థ ఎరెస్ మేనేజ్‌మెంట్‌తో చర్చలు

ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) సహ-యజమాని జయ్ మెహతా తన 45 శాతం వాటాలో సగం, అంటే 22.5 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల సంస్థ ఎరెస్ మేనేజ్‌మెంట్‌తో సుమారు 400 మిలియన్ డాలర్లకు (రూ. 3,300 కోట్లకు పైగా) ఈ భారీ నగదు ఒప్పందం జరగనుంది.

ముంబై/కోల్‌కతా, నవంబర్ 18 (సమయం న్యూస్): ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యంలో కీలక మార్పు చోటుచేసుకోనుంది. జట్టు సహ-యజమాని జయ్ మెహతా కేకేఆర్‌లో తనకున్న 45 శాతం వాటాలో సగం, అంటే 22.5 శాతం వాటాను విక్రయించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల సంస్థ 'ఎరెస్ మేనేజ్‌మెంట్'కు ఈ వాటాను విక్రయించనున్నారు. ఈ ఒప్పందం విలువ సుమారు 400 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 3,300 కోట్లకు పైగా) ఉంటుందని సమాచారం. ఈ డీల్ ప్రకారం కేకేఆర్ జట్టు మొత్తం విలువను 1.78 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ. 16,634 కోట్లు) నిర్ణయించారు. ఇటీవల రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల విక్రయాల విలువలకు అనుగుణంగానే కేకేఆర్ విలువ కూడా నమోదవడం విశేషం.

బీసీసీఐ అనుమతి తప్పనిసరి.. 5 శాతం రుసుము చెల్లింపు:

బాలీవుడ్ అగ్ర నటుడు షారుఖ్ ఖాన్‌కు కేకేఆర్‌లో 55 శాతం వాటా ఉండగా, జయ్ మెహతా, ఆయన భార్య, ప్రముఖ నటి జూహీ చావ్లాకు కలిపి 45 శాతం వాటా ఉంది. వీరంతా కలిసి 2007లో ఈ జట్టును కొనుగోలు చేశారు. తాజా వాటా విక్రయ ఒప్పందం పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. అయితే, ఈ వాటా బదిలీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారిక అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం, కొత్త పెట్టుబడిదారు నేపథ్యాన్ని బీసీసీఐ క్షుణ్ణంగా పరిశీలించనుంది. అంతేకాకుండా, ఈ ఒప్పందం మొత్తం విలువలో 5 శాతం అంటే సుమారు 20 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 200 కోట్లు) బీసీసీఐకి రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. 2022లో సీవీసీ క్యాపిటల్ సంస్థ గుజరాత్ టైటాన్స్ జట్టును కొనుగోలు చేసినప్పటి నుంచి ఐపీఎల్ ఫ్రాంచైజీలపై అమెరికా పెట్టుబడి సంస్థల ఆసక్తి బాగా పెరిగింది. ఆర్సీబీ జట్టులో కూడా బ్లాక్‌స్టోన్, బోల్ట్ వెంచర్స్ వంటి అమెరికా సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. ప్రస్తుతం కేకేఆర్ వాటాను కొనుగోలు చేస్తున్న ఎరెస్ మేనేజ్‌మెంట్‌కు క్రీడా రంగంలో పెట్టుబడులు పెట్టడం కొత్తేమీ కాదు. ఈ సంస్థకు ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్‌లో ప్రఖ్యాత చెల్సీ ఎఫ్‌సీ, ఎన్ఎఫ్ఎల్‌లో మయామి డాల్ఫిన్స్ జట్లలో వాటాలు ఉన్నాయి. అంతేకాకుండా, ఇంగ్లాండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' లీగ్‌లోని ట్రెంట్ రాకెట్స్ జట్టుకు కూడా సహ-యజమానిగా వ్యవహరిస్తోంది. మూడుసార్లు ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడిన కేకేఆర్ జట్టులో జరుగుతున్న ఈ వాటా మార్పు క్రీడా, వాణిజ్య వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

కొన్ని అధ్యాయాలు ముగియాల్సిందే..

- ధోనీ వీడ్కోలుపై సాక్షి భావోద్వేగం!
- ఐపీఎల్‌కు మహీ వీడ్కోలు పలికినట్లు వార్తలు
- కొత్త ప్రయాణానికి స్వాగతం అంటూ భార్య సాక్షి సందేశం



చెన్నై, నవంబర్ 18 (సమయం న్యూస్): భారత క్రికెట్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్‌కు వీడ్కోలు పలికినట్లు వెలువడుతున్న వార్తలు అభిమానులను భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన భార్య సాక్షి సింగ్ ధోనీ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న సందేశం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'కొన్ని అందమైన కొత్త అధ్యాయాలు ప్రారంభం కావాలంటే కొన్ని అధ్యాయాలు ముగియాల్సి ఉంటుంది' అంటూ ఆమె చేసిన పోస్ట్ చర్చనీయాంశమైంది. ఇన్నేళ్లుగా ధోనీని ప్రేమించి, ప్రోత్సహించి, అండగా నిలిచిన అభిమానులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 'కొత్త ప్రారంభాలు, కొత్త ప్రయాణాలు, మరెన్నో మధుర జ్ఞాపకాలకు స్వాగతం. నీ గురించి ఎంతో గర్వంగా ఉంది మహీ' అంటూ భావోద్వేగంతో పేర్కొన్నారు. సాక్షి తన సందేశంతోపాటు పచ్చని కొండలు, మంచుతో కప్పుకున్న పర్వతాల మధ్య ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న ధోనీ ఫొటోను పంచుకున్నారు. ఈ పోస్ట్‌పై అభిమానులు పెద్దఎత్తున స్పందిస్తున్నట్లు సమాచారం. చెన్నై సూపర్ కింగ్స్ అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా కూడా ధోనీపై గర్వాన్ని వ్యక్తం చేస్తూ స్పందించినట్లు కథనాలు వెలువడ్డాయి. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు యాజమాన్యంతో జరిగిన వీడియో సమావేశంలో ధోనీ తన నిర్ణయాన్ని వెల్లడించినట్లు జట్టు సహ యజమాని రూప గురునాథ్ తెలిపారని కథనాలు పేర్కొంటున్నాయి. వచ్చే సీజన్ కోసం విడుదల చేసే ఆటగాళ్ల జాబితాను పరిశీలిస్తున్న సమయంలో తన పేరును కూడా చేర్చాల్సి రావచ్చని ధోనీ వ్యాఖ్యానించినట్లు సమాచారం. జట్టుకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేనని భావిస్తే ధోనీ ఆట కొనసాగించరని రూప పేర్కొన్నట్లు తెలుస్తోంది. 2008 నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రధాన ఆధారంగా నిలిచిన ధోనీ తన నాయకత్వంలో జట్టుకు ఐదు ఐపీఎల్ టైటిళ్లు, రెండు చాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలు అందించారు. చెన్నైని పదిసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేర్చిన ఆయన 2020 ఆగస్టులో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఇప్పుడు ఐపీఎల్ నుంచి కూడా తప్పుకుంటున్నారన్న వార్తలతో అభిమానులు ఆయన అద్భుతమైన క్రికెట్ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

ఆసీస్‌ను చిత్తు చేసిన ఇంగ్లండ్

- వన్డే సిరీస్ కైవసం!
- నిర్ణయాత్మక పోరులో 97 పరుగుల భారీ విజయం
- మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్న ఇంగ్లండ్



హోబర్ట్, నవంబర్ 18 (సమయం న్యూస్): ఇంగ్లండ్ క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాను దాని సొంతగడ్డపైనే ఓడించి చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఇరు జట్ల మధ్య జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఇంగ్లండ్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది. హోబర్ట్ వేదికగా జరిగిన చివరి, నిర్ణయాత్మక మూడో వన్డేలో ఇంగ్లండ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి, ఆస్ట్రేలియాను 97 పరుగుల భారీ తేడాతో మట్టికరిపించింది. ఈ నిర్ణయాత్మక మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు ఓపెనర్ బెన్ డకెట్ అద్భుతమైన శతకంతో చెలరేగడంతో నిర్దిష్ట ఓవర్లలో ఇంగ్లండ్ 328 పరుగుల భారీ స్కోరు సాధించింది. బెన్ డకెట్ 115 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 133 పరుగులు బాది ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. అతనికి తోడుగా విల్ జాక్స్ 59 పరుగులు, టోమ్ బాంటన్ 44 పరుగులతో రాణించడంతో ఇంగ్లండ్ పటిష్ట స్థితికి చేరుకుంది. ఆస్ట్రేలియా బౌలర్లలో జాక్ ఎడ్వర్డ్స్ నాలుగు వికెట్లు పడగొట్టగా, మాట్ రెన్షా మూడు వికెట్లు దక్కించుకున్నాడు. అనంతరం 329 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు ఆరంభం నుంచే ఒత్తిడికి లోనైంది. ఇంగ్లండ్ బౌలర్లు అత్యంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ ఆసీస్ బ్యాటర్లను కట్టడి చేయడంతో ఆ జట్టు కేవలం 231 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ తరఫున మాట్ రెన్షా 55 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, అలెక్స్ కేరీ 37 పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లు ఎవరూ పెద్దగా రాణించలేకపోయారు. ఇంగ్లండ్ బౌలర్లలో సన్నీ బేకర్ నాలుగు వికెట్లు నేలకూల్చగా, లియామ్ డాసన్ మూడు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ చక్కటి వ్యూహాలతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన బెన్ డకెట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.



భారత్‌తో తొలి టెస్టు

కివీస్ కెప్టెన్ కీలక ప్రకటన!

న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్): భారత్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు ముందు న్యూజిలాండ్ కెప్టెన్ టామ్ లాథమ్ తమ జట్టు కూర్పుపై కీలక విషయాలు వెల్లడించాడు. తొలి టెస్టులో ముగ్గురు ఫాస్ట్ బౌలర్లు, ఒక బౌలింగ్ ఆల్‌రౌండర్‌తో బరిలోకి దిగనున్నట్లు స్పష్టం చేశాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో స్థానాల గురించి ఆలోచించకుండా తమదైన శైలిలో క్రికెట్ ఆడటంపైనే దృష్టి సారిస్తామని తెలిపాడు. తొలి టెస్టుకు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో లాథమ్ మాట్లాడాడు. న్యూజిలాండ్ పేస్ దళంలో మాట్ హెన్రీ, కైల్ జేమీసన్ కీలక పాత్ర పోషించనున్నట్లు లాథమ్ వెల్లడించాడు. మూడో పేసర్ ఎవరనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇటీవల భారత్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌లో కంకషన్‌కు గురైన హెన్రీ పూర్తిగా కోలుకున్నాడని తెలిపాడు. 'హెన్రీ పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాడు. టెస్టు క్రికెట్‌లో రాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు' అని పేర్కొన్నాడు. జేమీసన్ కూడా గత రెండు వారాలుగా తీవ్రంగా శ్రమిస్తున్నాడని, పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో అతడి బౌలింగ్ ఆకట్టుకుందని ప్రశంసించాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికపై స్పందించిన లాథమ్ ప్రస్తుతం తమ దృష్టంతా భారత్‌తో సిరీస్‌పైనే ఉందన్నాడు. డబ్ల్యూటీసీ ప్రస్తుత చక్రంలో ఆరు టెస్టులు ఆడి నాలుగు విజయాలతో న్యూజిలాండ్ అగ్రస్థానంలో ఉండగా, భారత్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నట్లు పేర్కొన్నాడు. అయితే పట్టికలో స్థానాల కంటే మైదానంలో మెరుగైన ప్రదర్శన చేయడమే ముఖ్యమని స్పష్టం చేశాడు. 'మా నియంత్రణలో ఉన్న అంశాలపైనే దృష్టి పెడతాం. మా ఆటతీరుకు అనుగుణంగా అవకాశాలను సృష్టించుకుని విజయాలు సాధించేందుకు ప్రయత్నిస్తాం' అని లాథమ్ వివరించాడు.



బాల్ ట్యాంపరింగ్ అందరికీ తెలుసు..

ఆసీస్ బండారం బయటపెట్టిన బ్యాన్‌క్రాఫ్ట్!

కేప్‌టౌన్, నవంబర్ 18 (సమయం న్యూస్): ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసిన 2018 కేప్‌టౌన్ బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో సాండ్‌పేపర్‌తో బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించి పట్టుబడిన ఆస్ట్రేలియా క్రికెటర్ కెమెరాన్ బ్యాన్‌క్రాఫ్ట్ ఎనిమిదేళ్ల తర్వాత సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారం తనకు, డేవిడ్ వార్నర్‌కు మాత్రమే పరిమితం కాదని, జట్టు కోచ్‌లు, ప్రధాన బౌలర్లకు కూడా ముందే తెలుసని పేర్కొన్నారు. మ్యాచ్‌లో ఆధిపత్యం సాధించాలనే ఒత్తిడిలో భాగంగా వార్నర్ ఈ ఆలోచన చేశారని, జట్టులో కొత్తవాడినైన తనతో ఆ పని చేయించారని వెల్లడించారు. జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవాలనే ఉద్దేశంతో తప్పని తెలిసినా అంగీకరించానని బ్యాన్‌క్రాఫ్ట్ వివరించారు. ప్రధాన కోచ్ డారెన్ లీమన్, బౌలింగ్ కోచ్ డేవిడ్ సాకర్‌తోపాటు పలువురు బౌలర్లకు ఈ వ్యవహారంపై అవగాహన ఉందని ఆరోపించారు. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హాజిల్‌వుడ్, మిచెల్ మార్ష్, టిమ్ పెయిన్ పేర్లను కూడా ప్రస్తావించారు. బంతి రివర్స్ స్వింగ్ అవుతున్న తీరుపై వారు తనతో మాట్లాడేవారని పేర్కొన్నారు. తన కదలికలు కెమెరాలకు చిక్కే ప్రమాదం ఉందని కోచ్ లీమన్ హెచ్చరించారని తెలిపారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల స్పందన తెలియాల్సి ఉంది. మైదానంలో సాండ్‌పేపర్ ఉపయోగిస్తూ కెమెరాలకు చిక్కిన తర్వాత అసలు విషయాన్ని బయటపెట్టవద్దని జట్టు మేనేజ్‌మెంట్ ఒత్తిడి తెచ్చిందని బ్యాన్‌క్రాఫ్ట్ ఆరోపించారు. సాండ్‌పేపర్ బదులుగా టేప్, మట్టి ఉపయోగించినట్లు చెప్పాల్సి వచ్చిందన్నారు. 2021లో బౌలర్లకు ఈ వ్యవహారం తెలుసా అనే ప్రశ్నకు తాను ఇచ్చిన సమాధానం తర్వాత వారు తమకేమీ తెలియదని ప్రకటనలు చేయడం బాధించిందని పేర్కొన్నారు. శిక్ష పూర్తయిన తర్వాత దేశవాళీ క్రికెట్‌లో రాణించినప్పటికీ తిరిగి జాతీయ జట్టులో అవకాశం దక్కలేదని బ్యాన్‌క్రాఫ్ట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంలో తప్పుల భారాన్ని తానొక్కడినే మోస్తున్నానని, ఉస్మాన్ ఖ్వాజా పుస్తకం విడుదలైన నేపథ్యంలో అసలు విషయాలను అభిమానులకు తెలియజేయాలనే ఉద్దేశంతో మాట్లాడుతున్నానని చెప్పారు. బ్యాన్‌క్రాఫ్ట్ తాజా ఆరోపణలతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో బాల్ ట్యాంపరింగ్ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది.

ఫులేరా గ్రామానికి మళ్లీ స్వాగతం

కొత్త సీజన్‌తో 'పంచాయత్' సందడి!

డిసెంబర్ 3 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో ఐదో సీజన్



హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కి దేశవ్యాప్తంగా ప్రేక్షకుల విశేష ఆదరణ పొందిన మోస్ట్ అవేటెడ్ కామెడీ వెబ్ సిరీస్ 'పంచాయత్' సీజన్ 5 త్వరలోనే అలరించడానికి సిద్ధమవుతోంది. డిసెంబర్ 3న ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ కొత్త సీజన్ గ్రాండ్‌గా స్ట్రీమింగ్ కానుంది. ఫులేరా గ్రామ ఎన్నికల రాజకీయాలు, ఆ తర్వాత చోటుచేసుకునే ఊహించని పరిణామాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడంతో పాటు ఉత్కంఠను పంచనున్నాయి. ఈ తాజా సీజన్‌లో జితేంద్ర కుమార్ (అభిషేక్), రఘుబీర్ యాదవ్ (ప్రధాన్ జీ), నీనా గుప్తా (మంజు దేవి), అశోక్ పాఠక్ తదితరులు తమ సహజ నటనతో మరోసారి మ్యాజిక్ చేయనున్నారు. గత సీజన్ ముగింపులో ఫులేరా గ్రామ రాజకీయాల్లో ఊహించని భూకంపమే సంభవించింది. దశాబ్దాలుగా గ్రామ రాజకీయాలను శాసించిన ప్రధాన్ జీ, ఆయన భార్య మంజు దేవి ఎన్నికల్లో ఊహించని ఓటమిని చవిచూశారు. వారి స్థానంలో ప్రత్యర్థి క్రాంతి దేవి గ్రామ కొత్త ప్రధాన్‌గా పగ్గాలు చేపట్టగా, ఆమె భర్త భూషణ్ అలియాస్ 'బన్‌రాకాస్' తెరవెనుక చక్రం తిప్పుతూ మరింత పవర్‌ఫుల్‌గా మారారు. కొత్త పాలకుల రాకతో గ్రామ కార్యదర్శి అభిషేక్‌కు అసలైన కష్టాలు మొదలవుతాయి. ప్రతీకార ధోరణితో వ్యవహరించే కొత్త నాయకత్వం మధ్య సచివ్ జీ అభిషేక్ పడే పాట్లు ప్రేక్షకులకు కడుపుబ్బా నవ్వులు పూయించనున్నాయి. మరోవైపు, తన కల అయిన ఎంబీఏ పూర్తి చేయడానికి సిద్ధమవుతున్న అభిషేక్.. గ్రామంలో ఇంకా ఏయే సమస్యలకు ముగింపు పలుకుతాడు? అధికార పీఠం దక్కించుకున్న బన్‌రాకాస్ అల్లరి ఏ స్థాయిలో ఉంటుంది? అన్న ఆసక్తికర అంశాలతో ఐదవ సీజన్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగనుంది. మొదటి సీజన్ నుంచి వరుసగా నాలుగు సీజన్ల పాటు అద్భుత విజయాన్ని అందుకున్న 'పంచాయత్' సిరీస్, డిసెంబర్ 3న రాబోతున్న కొత్త సీజన్‌తో మరింత వినోదాన్ని పంచేందుకు సిద్ధమైంది.



నేడు నా కల నిజమవుతోంది!

భావోద్వేగంతో యువ కథానాయిక శివాత్మిక రాజశేఖర్

హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): 'నాకు సినిమాలంటే పిచ్చి.. రేపు నా కల నిజమవుతోంది' అంటూ యువ కథానాయిక శివాత్మిక రాజశేఖర్ భావోద్వేగానికి లోనయ్యారు. ఆమె కీలక పాత్రలో నటించిన 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' చిత్రం నవంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. సినిమాలో తాను పోషించిన 'కీర్తన' పాత్రపై ఉన్న ప్రేమను, సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్న ఉత్సాహాన్ని అభిమానులతో పంచుకున్నారు. 'ఇది కలేం కాదు మా.. రేపు నా కల నిజమవుతోంది. నవంబర్ 19 నుంచి మా సినిమా థియేటర్లలో సందడి చేయబోతోంది. ఈ చిత్రం మీ అందరికీ నచ్చుతుందని, నన్ను కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అంటూ శివాత్మిక పేర్కొన్నారు. ఇకపై ప్రతి శుక్రవారం కొత్త కథలతో ప్రేక్షకులను థియేటర్లలో కలుస్తూనే ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'ఎందుకంటే.. నాకు సినిమాలంటే పిచ్చి!' అంటూ తన పోస్ట్‌ను ముగించారు. యువతను విశేషంగా ఆకట్టుకున్న 'ఈ నగరానికి ఏమైంది' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై సినీ ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా శివాత్మిక పోషించిన కీర్తన పాత్ర ఎలా ఉండబోతోందనే చర్చ జరుగుతోంది. సినిమాలపై ఆమెకున్న అభిమానాన్ని ప్రతిబింబించేలా చేసిన పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మరి ఈ చిత్రంతో శివాత్మిక ప్రేక్షకులను ఏ స్థాయిలో మెప్పిస్తారో చూడాలి.

బ్లాక్ డ్రెస్‌లో మౌనీ రాయ్ గ్లామర్ షో!

ముంబై, నవంబర్ 18 (సమయం న్యూస్): బాలీవుడ్ అందాల తార మౌనీ రాయ్ మరోసారి తన గ్లామర్‌తో ఆకట్టుకుంటున్నారు. నల్లటి దుస్తుల్లో ఆమె స్టైలిష్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అందం, అభినయంతోపాటు ఫ్యాషన్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మౌనీ రాయ్ విభిన్నమైన దుస్తులతో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తుంటారు. బుల్లితెర నుంచి వెండితెరకు ఎదిగిన మౌనీ రాయ్ తన నటనతోపాటు ఫ్యాషన్ అభిరుచితోనూ గుర్తింపు పొందారు. సంప్రదాయ దుస్తులైనా, ఆధునిక వస్త్రధారణైనా తనదైన శైలిలో కనిపించడం ఆమె ప్రత్యేకత. తాజాగా బ్లాక్ డ్రెస్‌లో ఆమె గ్లామరస్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సినిమాలు, ఫ్యాషన్ రంగాల్లో తన ప్రత్యేకతను చాటుకుంటూ మౌనీ రాయ్ ముందుకు సాగుతున్నారు.





ఎన్టీఆర్, అనిల్ రావిపూడి సినిమా టైటిల్ అదేనా?

తన తాత ఎన్టీఆర్ నటించిన ఆల్‌టైమ్ క్లాసిక్ 'లవకుశ' టైటిల్ కలిసొచ్చేలా 'జైలవకుశ' సినిమా చేసి బ్లాక్‌బస్టర్ అందుకున్నారు జూనియర్ ఎన్టీఆర్. ఇప్పుడు ఆ ఫీట్‌ని రిపీట్ చేస్తూ, మళ్లీ తాత ఎన్టీఆర్ టైటిల్ కలిసొచ్చేలా మరో సినిమా చేయనున్నారట తారక్. ఆల్‌టైమ్ క్లాసిక్ 'దానవీర-శూరకర్ణ' టైటిల్ కలిసొచ్చేలా.. 'దానవీరశూర' పేరుతో తారక్ సినిమా చేయనున్నట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. ప్రస్తుతం ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా చేస్తూ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత ఆయన అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా చేయనున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ఆ సినిమాకే 'దానవీరశూర' టైటిల్ అనుకుంటున్నారట. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివున్నది.



టాలీవుడ్ నటికి సైబర్ షాక్..

4.14 లక్షలు స్వాహా!

విమాన టికెట్ల బుకింగ్ పేరుతో అనితా చౌదరికి టోకరా



హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): ప్రముఖ టాలీవుడ్ నటి అనితా చౌదరి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. అమెరికా వెళ్లేందుకు విమాన టికెట్లు బుక్ చేసుకునే ప్రయత్నంలో ఏకంగా రూ. 4.14 లక్షలు పోగొట్టుకున్నారు. వాషింగ్టన్ డీసీలో నివసిస్తున్న తన కుమారుడి పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యేందుకు ఈ నెల 12న ఆమె ఆన్‌లైన్‌లో బిజినెస్ క్లాస్ విమాన టికెట్ల కోసం వెతికారు. ఈ క్రమంలో ఓ ట్రావెల్స్ సంస్థ పేరుతో కనిపించిన వెబ్‌సైట్‌లోని ఫోన్ నంబర్‌ను సంప్రదించగా రాజేశ్ అనే వ్యక్తి మాట్లాడాడు. వాషింగ్టన్ డీసీకి వెళ్లి తిరిగి వచ్చేందుకు బిజినెస్ క్లాస్ టికెట్ల ధర రూ. 4,14,180 అవుతుందని నమ్మించాడు. టికెట్ల బుకింగ్ కోసం డెబిట్ కార్డు వివరాలు కావాలంటూ ఓ ఫారం పంపించాడు. అనంతరం ఫోన్‌లో మాట్లాడుతూ ఆమె మొబైల్‌కు వచ్చిన ఓటీపీని కూడా అడిగి తెలుసుకున్నాడు. బుకింగ్ ప్రక్రియలో భాగంగానే ఓటీపీ అడుగుతున్నాడని భావించిన అనితా చౌదరి ఆ వివరాలను వెల్లడించారు. కొద్దిసేపటికే ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ. 4.14 లక్షలు బదిలీ అయ్యాయి. నగదు కట్ అయినట్లు సందేశం వచ్చినప్పటికీ విమాన టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ రాకపోవడంతో మోసపోయినట్లు అనితా చౌదరి గుర్తించారు. వెంటనే బ్యాంకు వినియోగదారుల సేవా కేంద్రాన్ని సంప్రదించి ఫిర్యాదు చేశారు. అనంతరం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు

- **మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

ఖమ్మం , నవంబర్ 18 : (సమయం న్యూస్)



అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.బుధవారం కల్లూరు పట్టణంలోని వికేఆర్ ఫంక్షన్ హాల్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి కల్లూరు మండలం, మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంత్రి పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు రాష్ట్రంపై రూ.8 లక్షల 21 వేల కోట్ల అప్పుల భారం మోపినప్పటికీ పేదలకు అందించే సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి కోతలు విధించకుండా, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు.పేదల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, రెండవ విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాద్ ప్రాంతంలో మరో లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. పేదింటి మహిళలు సొంతంగా ఇళ్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.కులం, మతం, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, మూడవ, నాలుగవ విడతల్లోనూ ఇళ్లను అందిస్తామని స్పష్టం చేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు పేద ప్రజలకు అవసరమైన అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆలోచించి అమలు చేస్తోందన్నారు. కల్లూరు పట్టణ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేశామని, ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమాల్లో ప్రజల నుంచి ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సమస్యలు, నూతన పెన్షన్లకు సంబంధించి అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, కల్లూరు మున్సిపల్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో ఆలేరు విద్యార్థుల పతకాల పంట

- **విజేతలకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా బహుమతుల ప్రదానం.. ఘనంగా సన్మానం**

ఆలేరు, నవంబర్ 18(సమయం న్యూస్):



జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన ఆలేరు మండల విద్యార్థులను ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యుడు బీర్ల ఐలయ్య ఘనంగా సన్మానించి అభినందించారు. కరాటే మాస్టర్ దర్శనం క్రాంతి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో నిర్వహించిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీల్లో ఆలేరు మండలానికి చెందిన విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. బి. భావన, జోయల్ రాజ్, సమీర్, అభిరామ్ రెడ్డి బంగారు పతకాలు సాధించగా, తేజపాల్ రెడ్డి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. హన్నికా, ప్రిన్సీ, ఆదిత్య శరణ్ కాంస్య పతకాలు సాధించి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేసి, పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. తెలంగాణ బిడ్డలుగా ఆలేరు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావడం సంతోషకరమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. చదువుతోపాటు క్రీడల్లోనూ పట్టుదల, క్రమ శిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులకు కరాటేలో శిక్షణనిస్తూ జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా తీర్చిదిద్దిన మాస్టర్ దర్శనం క్రాంతిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల విజయానికి శిక్షకుడి కృషి, నిరంతర సాధన ఎంతో దోహదపడ్డాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎజాజ్, కుల్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **పట్టణంలో మరిన్ని ర్యాంపులు, సీసీ రోడ్ల నిర్మాణం**
- **రెండు ప్రాంతాల్లో పనులకు శ్రీకారం చుట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్**

ఆలేరు, నవంబర్ 18(సమయం న్యూస్)



పట్టణ ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను పరిష్కరించి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఆలేరు మున్సిపల్ పాలకవర్గం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పట్టణంలోని రెండు ప్రాంతాల్లో సీసీ రోడ్డు, ర్యాంపుల నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ బుధవారం శ్రీకారం చుట్టారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ప్రతాపరెడ్డి దవాఖాన పక్కన ఉన్న కాలనీలోకి వెళ్లే రహదారి చాలా కాలంగా అధ్వానంగా ఉండటంతో స్థానికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానికులు మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో అక్కడ సీసీ రోడ్డు, ర్యాంపు నిర్మాణ పనులను ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని పాత వీఆర్ కళాశాల వద్ద కూడా ర్యాంపు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు, వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరమవుతాయని, దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న రహదారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే తమ ప్రథమ కర్తవ్యమని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రహదారి సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. పట్టణంలో ఎక్కడైనా రహదారులు, ర్యాంపులు, సీసీ రోడ్ల నిర్మాణం అవసరమున్నా, ఇతర ప్రజా సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పట్టణంలోని మరిన్ని ప్రాంతాల్లో ర్యాంపులు, సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను పరిశీలించి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం.ఏ. ఎజాజ్, కౌన్సిలర్లు మరియమ్మ, మార్కు, మాజీ కౌన్సిలర్ బేతి రాములు, వ్యాపారవేత్త మురారి శెట్టి రాజేశ్వర్, పాషికంటి కృష్ణ, డాక్టర్ ప్రతాప్ రెడ్డి, శేఖర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి... జిల్లా కలెక్టర్

ఖమ్మం, నవంబర్ 18 : (సమయం న్యూస్)



ఆక్వాన్ తుఫాను పూర్తిగా ఖమ్మం జిల్లాలో కేంద్రీకృతమైందని సమాచారం ఉన్నప్పటికీ, ప్రస్తుత సమాచారం ప్రకారం (బుధవారం మ. 2.00 గంటల) అట్టి తుఫాన్ ఒరిస్సా, ఛత్తీస్ గడ్ వైపు దారిమళ్లిందని తెలిసిందని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తుఫాను ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ, ఆక్వాన్ తుఫాన్ ఒరిస్సా, ఛత్తీస్ గడ్ లవైపు దారి మళ్లినందున జిల్లాపై తుఫాన్ ప్రభావం కొంత తక్కువగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ఈ నెల 20, 21 తేదీల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరికలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.అధికారులు, సిబ్బంది ఎవరూ కూడా హెడ్‌క్వార్టర్స్ విడిచి వెళ్లకూడదని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే మంజూరైన ఏవైనా సెలవులు ఉంటే వాటిని వెంటనే రద్దు చేసుకోవాలని అన్నారు. వరద నియంత్రణ ప్రొటోకాల్స్ అందరూ విధిగా పాటించాలని స్పష్టం చేశారు. రోడ్లపై ఎక్కడైనా నీరు పొర్లుతున్నా, లోతైన వంతెనలు లేదా కల్వర్టులు నీట మునిగినా వెంటనే ఆయా మార్గాలను బ్లాక్ చేసి ట్రాఫిక్ నిలిపివేయాలని కలెక్టర్ అన్నారు. స్థానిక తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు.గాలి వానలకు చెట్లు లేదా కొమ్మలు విద్యుత్ తీగలపై పడిపోతే వాటిని వెంటనే తొలగించడానికి ఉడ్ కట్టర్స్, ట్రీ కట్టర్స్ వంటి పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైన్ల పునరుద్ధరణకు పూర్తి సన్నద్ధతతో సిద్ధంగా ఉండాలన్నారు. మత్స్యకారులు ఎవరు కూడా చెరువులు, కుంటలు, వాగుల వైపు చేపల వేటకుగాని, ఈత కొట్టడానికి గానీ వెళ్లకూడదని మత్స్యశాఖ ద్వారా గట్టిగా హెచ్చరించాలని, సోషల్ మీడియాలో ఇన్స్టాగ్రామ్, రీల్స్ మొదలైన వాటిలో రీల్స్ చేయడం కోసం ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లరాదని, దీనిపై అధికారులు నిఘా పెట్టాలని ఆదేశించారు. పరిస్థితిని బట్టి అవసరమైన చోట సహాయక చర్యల కోసం ఈ నెల 21, 22 తేదీల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ అన్నారు. పరిస్థితి తీవ్రతను బట్టి, స్థానిక పరిస్థితుల ఆధారంగా పాఠశాలలకు, విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే పూర్తి అధికారం జిల్లా విద్యా శాఖ అధికారి, సంక్షేమ విద్యా సంస్థల అధికారులకు ఇస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా వుంటూ, అధికార యంత్రాంగానికి సహకరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

పేదలకు ఇంటి స్థలాలు కేటాయించే వరకు పోరాటం

- **రేపు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా**
- **సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్**

ఆలేరు, నవంబరు 18((సమయం న్యూస్):



కొలనుపాక గ్రామంలోని సర్వే నంబరు 8లో ఉన్న ప్రభుత్వ భూమిని నిరుపేదలకు ఇంటి స్థలాలుగా కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం గత మూడేళ్లుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆలేరు మండలం కొలనుపాకలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసిన స్థలంలో సీపీఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కొన్నబోయిన రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ హాజరై మాట్లాడారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మూడేళ్లుగా పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, తహసీల్దార్, కలెక్టర్, రెవెన్యూ అధికారులు, స్థానిక శాసనసభ్యుడు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ భూమిని నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించాల్సి ఉండగా, సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యపై గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించే వరకు ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, పోతు ప్రవీణ్, సుశీల, మోతె భవాని, సంధ్య, యాదమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు,బాలికలకు ఉచిత కంప్యూటర్ మరియు టాలీ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్18

సంగారెడ్డి జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా కేంద్ర ప్రభుత్వ బేటీ బచావో - బేటీ పడావో పథకంలో భాగంగా అర్హులైన మహిళలకు బాలికలకు ఉచిత కంప్యూటర్ మరియు టాలీ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి కె. లలితా కుమారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారుఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి కె. లలితా కుమారి మాట్లాడుతూ బాలికలు ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ఆధునిక సాంకేతిక ప్రపంచంలో కంప్యూటర్ నైపుణ్యాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా బాలికలు భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సంగారెడ్డి తహసీల్దార్ జయరాం మాట్లాడుతూ మహిళా సాధికారతలో విద్య, ఆర్థిక స్వావలంబన మరియు నైపుణ్యాభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త పల్లవి , ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత ,ఐసీడీఎస్ సూపెర్వైసోర్, హైశ్వర్య, జి యస్ విశాల, ట్రైనర్ మౌనిక, మహిళలు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.



చౌదరిపల్లి పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- **ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా గ్రంధాల చైర్మన్ రాజేష్ రెడ్డి**

బొంరస్ పేట మండలం,నవంబర్,18(సమయం న్యూస్)

వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండలంలోని చౌదరిపల్లి ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బి. కృష్ణవేణి,జిల్లా గ్రంధాలయం చైర్మన్ రాజేష్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు బాలల హక్కుల గురించి అవగాహన కల్పించారు. ప్రతి బాలబాలికకు విద్య, ఆరోగ్యం, రక్షణ, సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాలలపై జరిగే హింస, వివక్ష, బాల్యవివాహాలు, బాల కార్మికత్వాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు .ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్ రెడ్డి మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ముఖ్యంగా ఆడపిల్లలను రక్షించాలని, వారికి సమాన అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బాల బాలికలు ఇద్దరూ సమానమేనని, విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బొంరస్ పెట్ ఎంఇఓ హరిలాల్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ రాజ నాయక్, బాలల సంరక్షణ అధికారి శ్రీకాంత్,ఆంజనేయులు ,ఐసీడీఎస్ సూపెర్వైసోర్లు పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సాధికారత కేంద్రం సభ్యులు, సఖి కేంద్ర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ, బాలల సమగ్ర అభివృద్ధి, బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.



కేటీఆర్ సభకు జనప్రభంజనం సృష్టిద్దాం

- **గులాబీ జెండా నీడన ఒక్కటవుదాం.. కేటీఆర్ సభను చరిత్రాత్మకం చేద్దాం**
- **ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే, దాస్యం వినయ్ భాస్కర్**

హనుమకొండ, నవంబర్ 18 (సమయం న్యూస్)

ఈ నెల 22న హనుమకొండకు రానున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.బుధవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభకు తరలివచ్చేలా సమన్వయంతో పని చేయాలని సూచించారు. డివిజన్ల వారీగా ఇన్‌చార్జులు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు స్థానికంగా సమావేశాలు నిర్వహించి సభకు జనసమీకరణ చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతకు ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో జరుగుతున్న చేరికలే నిదర్శనమని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు. ప్రజల్లో బీఆర్ఎస్‌పై విశ్వాసం మరింత పెరుగుతోందని అన్నారు.ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మాజీ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సర్పంచ్

రాయపోల్: నవంబర్ 18

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును సర్పంచ్ రేణుక రాజా గౌడ్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలో భోజన నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షల లంచం తీసుకుంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెస్ట్

పెద్దపల్లి, నవంబర్ 18

పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకెన రవీందర్ రూ.1.50 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఆయనకు లంచం అందజేసిన రెడ్యరాజుల రాజయ్యను కూడా అధికారులు అరెస్ట్ చేశారు.ధర్మారం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన కేసులో నిందితులకు అనుకూలంగా సాక్షులను పరీక్షించి కేసు ముగించేందుకు రవీందర్ రూ.2 లక్షలు డిమాండ్ చేసి, చివరకు రూ.1.50 లక్షలకు ఒప్పుకున్నట్లు ఏసీబీ తెలిపింది. రాజయ్య ద్వారా లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ ప్రజలకు సూచించింది.



ఇందిరమ్మ కుటుంబ బీమా అమలుకు పకడ్బందీ చర్యలు

హైదరాబాద్, నవంబర్ 18:

ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నేతన్న, గౌడ, కార్మిక, మత్స్యకారులకు ప్రస్తుతం ఉన్న రూ.2 లక్షల బీమాను రూ.5 లక్షలకు పెంచేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హులైన కుటుంబ సభ్యులందరినీ నమోదు చేయించి, పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేక యాప్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ నమోదు సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు.



కామారెడ్డిలో ఏఎంఆర్‌పై అవగాహన ర్యాలీ

కామారెడ్డి, నవంబర్ 18

ప్రపంచ యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, యాంటీబయాటిక్స్, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్ మందులను వైద్యుల సూచన మేరకే వినియోగించాలని సూచించారు. మందులను అనవసరంగా వినియోగించడం వల్ల నిరోధకత పెరిగే ప్రమాదం ఉందన్నారు. “వన్ హెల్త్-వన్ యాక్షన్” నినాదంతో నిర్వహించిన ర్యాలీలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో పీఆర్‌టీఎస్‌కు కార్యాచరణ ప్రణాళిక

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, ప్రజా రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (PRTS) ఏర్పాటుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.తొలి దశలో కూకట్‌పల్లి-రాయదుర్గం-బయోడైవర్సిటీ-నాలెడ్జ్ సిటీ మార్గంలో సుమారు 35 కిలోమీటర్ల మేర 64 స్టేషన్లతో పీఆర్‌టీఎస్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

2030 నాటికి రోజుకు 3.94 లక్షలు, 2040 నాటికి 7.96 లక్షలు, 2050 నాటికి 10 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలు ఉంటాయని హెచ్‌ఎంఆర్‌ఎల్ అంచనా వేసింది.మెట్రో రైలు, ఆర్టీసీ, జీఆర్‌టీ తదితర ప్రజా రవాణా వ్యవస్థలతో పీఆర్‌టీఎస్‌ను అనుసంధానించి సమగ్ర రవాణా వ్యవస్థగా అభివృద్ధి చేయాలని సీఎస్ సూచించారు. ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను గరిష్టంగా వినియోగించుకుని, తక్కువ వ్యయంతో ప్రాజెక్టును అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ ఆధ్వర్యంలో సంబంధిత శాఖలు, సంస్థల సూచనలు తీసుకుని సమగ్ర రూట్ మ్యాప్, కార్యాచరణ ప్రణాళికను త్వరగా సిద్ధం చేయాలని సంజయ్ జాజు స్పష్టం చేశారు.

ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ మద్దతు విస్తరణకు ఫియో స్వాగతం

న్యూఢిల్లీ, నవంబర్ 18

ఎగుమతుల ప్రోత్సాహక మిషన్‌లోని కీలక పథకాల మార్గదర్శకాల్లో కేంద్ర వాణిజ్య శాఖ చేసిన సవరణలను భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (ఫియో) స్వాగతించింది. ఈ మార్పులు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), తొలిసారి ఎగుమతిదారులు, తక్కువ ఎగుమతులు ఉన్న ప్రాంతాల్లోని వ్యాపారాలకు మరింత ప్రయోజనం చేకూర్చనున్నాయని ఫియో అధ్యక్షుడు ఎస్.సి. రల్హాన్ తెలిపారు.అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలు, కొనుగోలుదారులు-విక్రేతల సమావేశాలు, వాణిజ్య ప్రతినిధి బృందాల్లో పాల్గొనేందుకు విమాన ప్రయాణ ఖర్చులపై 95 శాతం వరకు సహాయం అందించడం, అర్హత ఎగుమతి టర్నోవర్ పరిమితిని రూ.75 లక్షల నుంచి రూ.50 కోట్లకు పెంచడం వంటి చర్యలను ఫియో ప్రశంసించింది.నాణ్యత, ప్రమాణాల ధ్రువపత్రాల కోసం అర్హమైన సర్టిఫికెట్ల సంఖ్యను 462 నుంచి 600కు పెంచడం వల్ల ఎంఎస్ఎంఈలకు అంతర్జాతీయ ప్రమాణాలను చేరుకోవడం సులభతరం అవుతుందని పేర్కొంది.రవాణా, సరకు రవాణా సహాయ పరిధిని 13 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 34కు పెంచడం, భూకస్టమ్స్ కేంద్రాలు, సమగ్ర తనిఖీ కేంద్రాలు, జల మార్గాలను చేర్చడం వల్ల తక్కువ ఎగుమతి సామర్థ్యం ఉన్న ప్రాంతాల ఎగుమతిదారులకు ప్రయోజనం కలుగుతుందని ఫియో తెలిపింది. ఈ మార్పులు ఎగుమతి వ్యయాన్ని తగ్గించి, భారతీయ ఎంఎస్ఎంఈలను ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించడంలో కీలకంగా పనిచేస్తాయని, దేశ ఎగుమతుల వృద్ధికి మరింత ఊతమిస్తాయని ఫియో అభిప్రాయపడింది.

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

- **అత్యాశకు పోయి సైబర్ మోసగాళ్ల వలలో పడొద్దు**
- **సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**

నారాయణపేట, నవంబర్,18(సమయం న్యూస్)

నారాయణపేట జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని, ప్రజలు కూడా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ఫోన్ కాల్స్, వాట్సాప్ మెసేజ్‌లు, సోషల్ మీడియా, నకిలీ వెబ్‌సైట్లు, లింకులు, ఫేక్ యాప్స్, ఉద్యోగాలు, లోన్లు, పెట్టుబడుల పేరుతో ఆకర్షించి ప్రజల బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు అధికారులు, పోలీసులు, కస్టమర్ కేర్ ప్రతినిధులమని చెప్పి ఎవరైనా OTP, ATM PIN, CVV, UPI PIN, పాస్‌వర్డ్‌లు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించకూడదని సూచించారు.తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద యాప్‌స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, KYC అప్‌డేట్, బ్యాంకు ఖాతా బ్లాక్, SIM కార్డు క్లోజ్, డిజిటల్ అరెస్ట్, పోలీస్ కేసు, కొరియర్ పార్సెల్ వంటి పేర్లతో బెదిరించే మోసగాళ్ల మాటలు నమ్మవద్దని హెచ్చరించారు.సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ఉద్యోగ ప్రకటనలు, పార్ట్‌టైమ్ జాబ్స్, ఆన్‌లైన్ ట్రేడింగ్, తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయంటూ చేసే పెట్టుబడి ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకొని టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ (TwoFactor Authentication) తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. పిల్లలు, యువత ఆన్‌లైన్‌లో ఎవరితో మాట్లాడుతున్నారు, ఎలాంటి లింకులు ఓపెన్ చేస్తున్నారు అనే విషయాలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. డిజిటల్ చెల్లింపుల సమయంలో డబ్బులు స్వీకరించడానికి UPI PIN నమోదు చేయాల్సిన అవసరం లేదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెలిపారు.సైబర్ మోసానికి గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి డబ్బులు కోల్పోతే ఆందోళన చెందకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు. అదేవిధంగా సంబంధిత బ్యాంకుకు సమాచారం అందించి ఖాతాలను సురక్షితంగా చేసుకోవాలని తెలిపారు.మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా బాధితుల డబ్బును నిలిపివేసే అవకాశం ఉంటుందని, అందువల్ల మోసానికి గురైన విషయాన్ని దాచిపెట్టకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని,అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, లింకులు వచ్చినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కోరారు.అప్రమత్తతే సైబర్ నేరాలకు తొలి రక్షణ.మీ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ వెల్లడించకుండా జాగ్రత్తలు పాటించాల

కటకం నాగమణికి విప్లవ జోహార్లు

- **రఘునాథపురంలో పూలమాలలతో ఘన నివాళులు అర్పించిన సీపీఐ (ఎం.ఎల్.) న్యూడెమోక్రసీ నాయకులు**

ఆలేరు, నవంబరు 18(సమయం న్యూస్):

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమర వీరయోధుడు కామ్రేడ్ కటకం అంజన్న జీవిత భాగస్వామి కామ్రేడ్ కటకం నాగమణి మృతి పట్ల సీపీఐ (ఎం.ఎల్.) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఆమె మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం రఘునాథపురంలో కటకం నాగమణి భౌతికకాయాన్ని సీపీఐ (ఎం.ఎల్.) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమెకు విప్లవ జోహార్లు అర్పిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం నిర్వహించిన సంతాప సభలో సీపీఐ (ఎం.ఎల్.) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్దన్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమర వీరుడు కామ్రేడ్ కటకం అంజన్న జీవిత భాగస్వామి నాగమణి మరణం బాధాకరమన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రజా ప్రతిఘటన పోరాటాలను నిర్మించడంలో కటకం అంజన్న కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. రైతులు, కూలీలు, పాలేర్లకు న్యాయమైన వేతనాలు కల్పించాలని, ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా అంజన్న నిరంతరం పోరాడి వీరమరణం పొందారని పేర్కొన్నారు. ఆయన జీవితం ప్రజా పోరాటాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అంజన్న పోరాట జీవితంలో అడుగడుగునా అండగా నిలిచిన కామ్రేడ్ కటకం నాగమణి త్యాగం, సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రజా ఉద్యమాల పట్ల అంకితభావంతో జీవించిన ఆమె ధన్యజీవిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, సీపీఐ (ఎం.ఎల్.) డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, కటకం నాగమణి కుమారులు బాబు, రమేష్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మామిడాల సోమయ్య, అధ్యక్షుడు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్. సీత, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మారుజోడు సిద్ధేశ్వర్, అరుణోదయ జిల్లా నాయకుడు మామిడాల బాల మల్లేష్, ఇక్కిరి శ్రీనివాస్, ప్రజాసంఘాల జిల్లా నాయకులు బర్మ బాబు, సుంకే సుగుణ, ఇంజ శ్రీనివాస్, ఎర్ర మల్లేష్, గడ్డం మంకయ్య, కొంగరి సాయిరాం, గడ్డం యాదగిరి, ఉచ్చంతల మల్లేష్, నారాయణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

- **విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక గుర్తింపు.. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

ఆలేరు, నవంబర్ 18(సమయం న్యూస్):



జాతీయ విద్యార్థి సైనిక దళం (ఎన్సీసీ) శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందడమే కాకుండా భవిష్యత్తులో విద్య, ఉద్యోగ రంగాల్లోనూ మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్సీసీ అధికారి దూడల వెంకటేష్, ఆర్మీ అధికారి హవల్దార్ ఉమేష్ కాంబ్లే అన్నారు. విద్యార్థులు ఎన్సీసీ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఆలేరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండేళ్ల ఎన్సీసీ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఏ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రెండేళ్ల శిక్షణ కాలంలో విద్యార్థులకు కవాతు, ఆయుధాల వినియోగం, పటాల పథనం వంటి అంశాలతోపాటు శారీరక, మానసిక వికాసానికి అవసరమైన శిక్షణ అందించినట్లు తెలిపారు. వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, ఆత్మ విశ్వాసం, జీవన నైపుణ్యాలు పెంపొందించే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆయుధాల వినియోగం, కాల్పుల శిక్షణ, వ్యక్తిత్వ వికాసం తదితర విభాగాల్లో శిక్షణ పొంది, నిర్దిష్ట పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ ధ్రువపత్రాలను అందజేసినట్లు వివరించారు. ఎన్సీసీ ధ్రువపత్రాలు ఉన్న విద్యార్థులకు ఉన్నత విద్య, వివిధ ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా సైన్యం, ఇతర రక్షణ రంగాల్లో చేరాలనుకునే యువతకు ఎన్సీసీ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎన్సీసీ కేవలం శిక్షణకే పరిమితం కాకుండా విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతుందని, సమయపాలన, క్రమశిక్షణ, సేవాభావం, దేశం పట్ల అంకితభావం వంటి విలువలను అలవర్చుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఇలాంటి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ ఏ సర్టిఫికెట్లు అందుకున్న వారిలో క్యాడెట్లు భార్గవి, భవాని, రేచల్, వర్షిత, సంజయ్, రిత్విక్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమాతో ఆర్థిక భరోసా...

- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు”**
- **జిల్లా వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

వికారాబాద్, నవంబర్,18(సమయం న్యూస్)

రాష్ట్రంలోని ప్రతి అర్హత కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఆకస్మికంగా మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా 5 లక్షల రూపాయల జీవిత బీమా రక్షణ కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పథకం క్రింద ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన సంపాదించే ఒక వ్యక్తిని బీమా పరిధిలోకి తీసుకోవాలని,కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తున్నట్లయితే ఎవరిని బీమా పరిధిలోకి తీసుకోవాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకునే అవకాశం కల్పించాలని తెలిపారు.కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా అర్హులైన కుటుంబాలకు పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించనున్నందున లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని తెలిపారు. నమోదు ప్రక్రియలో భాగంగా గ్రామాలు, పట్టణాలు, వార్డుల వారీగా ప్రత్యేక సహాయక నమోదు శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డుల వివరాల ఆధారంగా కుటుంబాలను గుర్తించడంతో పాటు, రేషన్ కార్డులలో పేర్లు లేని వారు, రేషన్ కార్డులు లేని కుటుంబాలకు కూడా ప్రత్యేక దరఖాస్తు విధానం ద్వారా నమోదు అవకాశం కల్పించాలని సూచించారు. బీమా పొందే వ్యక్తి వివరాలు, ఆధార్ ఆధారిత పుట్టిన తేదీ, కుటుంబ సభ్యులు, నామినీల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని, ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకునే అవకాశం ఉన్నందున వారికి అందే వాటాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు.మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల నమోదు, అవసరమైన సేవలు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ జిల్లాలో పథకం అమలుకు నోడల్ అధికారులను నియమించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాలలో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని వివరించారు.పథకం విజయవంతంగా అమలు చేసేందుకు ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని, మండల స్థాయి అధికారులు, వార్డు అధికారులకు ప్రభుత్వం నిర్దేశించిన ఎస్ఓపిపై శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు,మున్సిపాలిటీలకు ప్రత్యేక లాగిన్ సదుపాయం కల్పించడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలో ప్రతి నమోదు శిబిరంలో ఇంటర్నెట్ కనెక్షన్, ప్రింటర్, స్కానర్ వంటి అవసరమైన సాంకేతిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.



గ్రామాలలో ముందుగా నింపిన దరఖాస్తు ఫారాలను శిబిరాలలో అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు.ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతి అర్హత కుటుంబానికి పథకంపై అవగాహన కల్పించి, ఎవరూ మిగిలిపోకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూర్, సి పి ఓ వెంకటేశ్వర్లు, ఇ డి ఎం మహమూద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమంతో అర్థవంతంగా దేవేందర్ రాజన్న గారి జన్మదిన వేడుకలు..

సంగారెడ్డి జిల్లా సమయం న్యూస్ నవంబర్18

పటాన్చెరు నియోజకవర్గంలో దేవేందర్ రాజన్న గారి పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఇంద్రేశం పరిధిలోని మదర్ మేరీ అనాధ వృద్ధుల సేవాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వృద్ధులకు భోజనం వడ్డించి, వారితో కొంత సమయం గడుపుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. పుట్టినరోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, ఆప్యాయతను పంచుతూ, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ద్వారా సేవాభావాన్ని చాటుకోవడం ఎంతో సంతోషకరం. కార్యక్రమంలో MDR ఫౌండేషన్ అధ్యక్షుడు మధు మరియు సభ్యులు పాల్గొన్నారు

